సూర్య 19 వ వసంతంలోకి ...
www.suryaa.com
visit us @ https://www.suryaepaper.com

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

గురువారం | 29 జనవరి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 99
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, మాఘ మాసం శుక్ల పక్షం ఏకాదశి మ.12.10, మృగశిర తె.4.32, వర్జ్యం ఉ.11.22 నుంచి 12.51 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.10.13 నుంచి 10.57 వరకు తిరిగి మ.2.36 నుంచి 3.20 వరకు

# మహారాష్ట్రలో ఘోర విమాన ప్రమాదం

- డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సహా నలుగురు దుర్మరణం
- సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన
- ప్రమాద తీవ్రతకు రెండు ముక్కలైన విమానం
- పీఎస్‌వో వదీప్ జాదవ్, కెప్టెన్ సుమిత్ కపూర్, కెప్టెన్ శాంభవి పాఠక్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి మరణించినట్లు ధృవీకరణ

మహారాష్ట్రలో విషాదం చోటుచేసుకుంది. విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలింది ఈ దుర్ఘటనలో పవార్ (66)తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబయి నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ముంబయి నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది.



6 లో

## గత పదేళ్లలో 25 కోట్ల మందికి
# పేదరికం నుంచి విముక్తి

- వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం
- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల
- బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి

పేదల కోసం 4 కోట్ల ఇళ్లు నిర్మించామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. గత పదేళ్లలో 25 కోట్లమందిని పేదరికం నుంచి విముక్తి కల్పించామని చెప్పారు. ఇంకా 100 కోట్లకుపైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని వెల్లడించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రస్తావించిన రాష్ట్రపతి, బిర్సాముండా, సర్దార్ పటేల్‌కు నివాళులు అర్పించారు.



6 లో

## అన్ని దారులు
# మేడారం వైపే

- మహాఘట్టానికి సిద్ధమైన మేడారం
- గద్దెలపైకి సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు
- ఏర్పాట్లు నిరంతరం పర్యేక్షిస్తున్న మంత్రి సీతక్క



2 లో

మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతరకు భక్తులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో అన్ని దారులు మేడారం వైపే వస్తున్నాయని, లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం క్యూలైన్లను సక్రమంగా నిర్వహిస్తున్నామని, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భక్తులకు నీడ కల్పించే విధంగా విస్తృతంగా షెడ్లు ఏర్పాటు చేశామని చెప్పారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## అజిత్ పవార్ మృతికి
# సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి

- ఈ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఎక్స్‌లో పోస్ట్
- ఆయన కుటుంబం ధైర్యంగా ఉండాలని సూచన
- కేసీఆర్, కేటీఆర్ ప్రభృతుల సంతాపం



విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ లో పోస్ట్ చేశారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బుధవారం ఉదయం జరిగిన విమాన ప్రమాదంలో దుర్మరణం చెందడంతో దేశ రాజకీయాల్లో పెను విషాదం నెలకొంది. ఆయన మృతదేహాన్ని తరలించగా ఆస్పత్రి వద్ద భారీ ఎత్తున పార్టీ నేతలు, ప్రజలు చేరుకున్నారు. తమ నేతను కోల్పోవడంతో కంటతడి పెట్టుకుంటున్నారు.

## సంగారెడ్డిలో కొత్త సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు మంత్రి శంకుస్థాపన



2 లో

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కర్దనూరులో నూతనంగా నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , వివేక్ వెంకట స్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భూమి సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా
# ఎగురవేయాలి

కార్పొరేటర్ ఆశావహులతో మంత్రులు తుమ్మల, పొన్నం ముఖాముఖి



2 లో

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా పోటీ చేయనున్న ఆశావహులతో వారు ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

## అంతా ఇంతే!




మొదటి సభ మేడారంలో పెట్టిద్దాం ఓట్లన్నీ మనకే !

## అణ్వాయుధాల తయారీపై
## ఉత్తర కొరియా దూకుడు



6 లో

- వర్కర్స్ పార్టీ ప్లీనరీలో కీలక ప్రకటన చేయనున్న కిమ్
- తదుపరి దశ అణు కార్యక్రమాల ప్రణాళికను వెల్లడించే అవకాశం
- ఇప్పటికే భారీ రాకెట్ లాంచర్ వ్యవస్థల విన్యాసాలను పరిశీలించిన కిమ్

అణ్వాయుధాల తయారీపై ఉత్తర కొరియా మరింత దూకుడు పెంచేందుకు సిద్ధమైంది. త్వరలో జరగబోయే వర్కర్స్ పార్టీ ప్లీనరీలో అణు కార్యక్రమాలను ఉధృతం చేసే ప్రణాళికను ప్యాంగ్‌యాంగ్ అధినేత కిమ్ వెల్లడించనున్నారు.

## అదే మోసం..
# ఇంకెంత కాలం

- మున్సిపల్ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయరా
- బీసీలకు గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- గతంలో 34 శాతం అమలు చేసి ఇప్పుడు 28 శాతంకు తగ్గిస్తారా!
- ఇది మోసం - దగా కాదా!
- శాంతియుతంగా ఉద్యమాలు చేస్తే స్పందించరా! దాడులు చేయాలా!
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య



బీసీలను ఇంకెంత కాలం మోసం చేస్తారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రస్తుతం ప్రకటించిన మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు కేవలం 28.5% తగ్గించి బీసీలకు దగా చేశారు. మోసం చేశారు.

## రూ.30 లక్షల వ్యయంతో
# హెల్త్ ఎటిఎం

ఫ్రైమ్ టేర్ మిషన్, ఈసీజీ మిషన్ ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి




ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను సులభంగా, వేగంగా అందించాలనే లక్ష్యంతో రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హెల్త్ ఎటిఎం ప్రైమ్ టేర్ మిషన్, ఈసీజీ మిషన్‌ను రాష్ట్ర రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు.మంగళవారం నాడు నల్గొండ జిల్లా ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ విభాగంలో ఏర్పాటు చేసిన మిషన్స్ ను కూడా ప్రారంభించారు.

వివరాలు-2లో

## 2027 ఫిబ్రవరిలో దేశంలో
# కుల గణన



- గతంలో మాదిరిగానే రెండు దశల్లో జనాభా లెక్కింపు
- మంచు రాష్ట్రాల్లో 2026 సెప్టెంబర్‌లో నిర్వహణ
- 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్న కులగణన

జనగణన ప్రక్రియలో భాగంగా కుల గణనను రెండో దశలో చేపట్టనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

రాష్ట్రీయం తెలంగాణ

# అజిత్ పవార్ మృతికి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి



● ఈ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఎక్స్‌లో పోస్ట్ ● ఆయన కుటుంబం ధైర్యంగా ఉండాలని సూచన ● కేసీఆర్ , కేటీఆర్ ప్రభృతుల సంతాపం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ లో పోస్ట్ చేశారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బుధవారం ఉదయం జరిగిన విమాన ప్రమాదంలో దుర్మరణం చెందడంతో దేశ రాజకీయాల్లో పెను విషాదం నెలకొంది. ఆయన మృతదేహాన్ని తరలించగా ఆస్పత్రి వద్ద భారీ ఎత్తున పార్టీ నేతలు, ప్రజలు చేరుకున్నారు. తమ నేతను కోల్పోవడంతో కంటతడి పెట్టుకుంటున్నారు. అజిత్ పవార్ మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రతిపక్ష నేతలు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఎక్స్ లో పోస్ట్ చేస్తు విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. బారామతిలో జరిగిన ప్రమాదంలో ఆయన మరణించడం ఎంతో బాధాకరమని, ఈ కష్టకాలంలో ఆయన కుటుంబం ధైర్యంగా ఉండాలని కోరారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని, అజిత్ పవార్ మృతిపట్ల సంతాపాన్ని ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లు కూడా అజిత్ పవార్ మృతిపట్ల సంతాపం తెలిపారు. రైతు ఉద్యమనేతగా ప్రజా జీవితాన్ని ప్రారంభించి ఎంతో ఎదిగారని, కీలక నేతకు ఇలాంటి మరణం రావడం కలచివేసిందన్నారు. ప్రజలతో అజిత్ పవార్ కు ఎంతో అనుబంధం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన మరణం మహారాష్ట్ర రాజకీయాలకు తీరని లోటన్నారు. పవార్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**మంత్రి జూపల్లి, వాకిటి శ్రీహరి ప్రభృతుల సంతాపం**

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ హఠాన్మరణం పట్ల క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణవార్త తమను ఎంతో కలచివేసిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రులు ఆకాంక్షించారు. అజిత్ పవార్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ పవార్ చెరగని ముద్ర వేశారని వారు కొనియాడారు. క్షేత్రస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి, పరిపాలనా దక్షుడిగా పేరు తెచ్చుకున్న ఆయన మరణం మహారాష్ట్రకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, అభివృద్ధి పట్ల ఆయనకున్న విజన్ స్ఫూర్తిదాయకమని అన్నారు.

# రూ.30 లక్షల వ్యయంతో హెల్త్ ఎటిఎం




**ప్రైమ్ టేర్ మిషన్, ఈసీజీ మిషన్ ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను సులభంగా, వేగంగా అందించాలనే లక్ష్యంతో రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హెల్త్ ఎటిఎం ప్రైమ్ టేర్ మిషన్, ఈసీజీ మిషన్‌ను రాష్ట్ర రోడ్డు భవనాల సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. మంగళవారం నాడు నల్గొండ జిల్లా ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ విభాగంలో ఏర్పాటు చేసిన మిషన్స్ ను కూడా ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచే ఆధునిక నిర్ధారణ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఖరీదైన ఆసుపత్రులకు వెళ్లకుండానే ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐడీబీఐ సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు 1కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన పరికరాల పట్ల ఐడీబీఐ పూర్ణిమను అభినందించారు. భవిష్యత్ లో పేదవారికి మరింత సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

జీజీహెచ్ లో ఏర్పాటు చేసిన హెల్త్ ఎటిఎంలో ఈసీజీ, బీపీ, బ్లడ్ షుగర్, పల్స్, బాడీ టెంపరేచర్, ఆక్సిజన్ సాచ్యురేషన్ వంటి పరీక్షలు తక్కువ సమయంలో నిర్వహించవచ్చని తెలిపారు. పరీక్షల ఫలితాలు డిజిటల్ రూపంలో వెంటనే లభించడం వల్ల వైద్యులు సరైన చికిత్స సూచించేందుకు సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు.

గ్లూకోమియా కంటి పరీక్ష ఈ కంటి పరీక్షలు చేస్తారు కంటి విభాగంలో వచ్చే సమస్యలను రెట్టిన దెబ్బతిందా లేదా తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు. ప్రైమ్ టేర్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ప్రివెంటివ్ హెల్త్ కేర్ను బలోపేతం చేస్తాయని, హృదయ సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడంలో ఈసీజీ మిషన్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వివరించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇటువంటి హెల్త్ ఎటిఎంలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు.

నల్గొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ రెవిన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ స్థానిక సంస్థల ఇంచార్జ్ కలెక్టర్ వై అశోక్ రెడ్డి సూపరింటెంట్ నేత నరసింహారావు ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, స్థానిక అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

**కార్పొరేటర్ ఆశావహులతో మంత్రులు తుమ్మల, పొన్నం ముఖాముఖి**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా పోటీ చేయనున్న ఆశావహులతో వారు ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ కాంగ్రెస్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, కరీంనగర్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

**పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక : పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ "ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో గ్రామాల మాదిరిగానే పట్టణాల అభివృద్ధికి కూడా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే మన లక్ష్యం" అని స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోని 66 డివిజన్లకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశావహులు తమ బలాబలాలను తామే అంచనా వేసుకుని ప్రజల్లో పనిచేయాలని సూచించారు.

**ప్రజల్లో ప్రజాపాలనకు పాజిటివ్ స్పందన**

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికెళ్లినా ప్రజా పాలనపై ప్రజలు సానుకూలంగా ఉన్నారని మంత్రి పొన్నం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ గెలుపు కోసం శ్రమించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని, ఇప్పటి వరకు ఆర్టీసీకి రూ.9 వేల కోట్లకు పైగా చెల్లించామని తెలిపారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఉద్యోగ నియామకాలు, సన్న వడ్లకు బోనస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని చెప్పారు. టికెట్ ఎవరికి వచ్చినా అందరూ కలిసి గెలవాలి పోటీ చేసే ఆశావహులు తమ తమ వార్డుల్లో తిరుగుతూ పార్టీని బలోపేతం చేయాలని, టికెట్ ఎవరికి వచ్చినా అందరూ సమన్వయంతో కలిసి పని చేసి గెలవాలని మంత్రులు సూచించారు. రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కరీంనగర్ ఇంచార్జిగా ఉన్నారని, సెలెక్ట్ఎలెక్ట్ విధానం ద్వారా అభ్యర్థుల ఎంపిక జరగనుందని తెలిపారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# సంగారెడ్డిలో కొత్త సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు మండలం కర్దనూరులో నూతనంగా నిర్మించనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , వివేక్ వెంకట స్వామి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భూమి సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధరణి వ్యవస్థను మార్చి.. భూ భారతి వ్యవస్థను తీసుకొచ్చామని.. సామాన్య ప్రజలకు ఒక చుట్టం లాంటిదిగా భూ భారతిని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో కోట్లాది రూపాయలు ఫీజులు చెల్లించే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని వివరించారు. అంతేకాకుండా ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పటాన్‌చెరు ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం 3 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి అదనపు భారం పడకుండా సీఎస్ఆర్ ఫండ్ ద్వారా ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణ పనులను రాజ్ పుష్ప సంస్థకు అప్పగించినట్లు వివరించారు. రాబోయే 6 నెలల్లో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో అన్ని సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. పెద్దపల్లిలోనూ రాజ్ పుష్ప సంస్థ.. భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఈ భవనాల మెయింటెనెన్స్‌ను ఐదేళ్ల పాటు సంబంధిత సంస్థలకే అప్పగించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏజెన్సీలను ఎంపిక చేసి ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నట్లు వెల్లడించారు. ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫైవ్ స్టార్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మ్యారేజ్ హాల్స్, చంటి పిల్లల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఉండనున్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా భూధార్ వ్యవస్థను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ఒకే ప్లాట్‌ఫాం ద్వారా భూమి సరిహద్దులు, వివరాలు అందుబాటులో ఉండనున్నాయని అన్నారు.

నిషేధిత భూముల విషయంలో అనేక వివాదాలు ఉన్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి రెండు నెలల్లో కొత్త యాప్‌ను తీసుకువస్తున్నట్లు తెలిపారు. భూధార్ కార్డు.. భూమి సంబంధిత అన్ని సమస్యలకు సంపూర్ణ పరిష్కారం అని, దీని ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉండవని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు నిర్మలా జగ్గారెడ్డి, ఫహీంలు పాల్గొన్నారు.

## మేడారం జాతరను కేంద్రం జాతీయ పండుగగా ప్రకటించాలి

● సమ్మక్క, సారలమ్మ వీరోచిత గాథను గ్రంథస్థం చేయాలి

● ములుగు జిల్లాకు సమ్మక్క సారలమ్మ జిల్లాగా పేరు పెట్టాలి

● సమ్మక్క సారలమ్మల ప్రతిరూపమే మంత్రి సీతక్క

● రాష్ట్రంలో బహుజన రాజ్యం రావాలని తల్లులకు మొక్కుకున్నా

● సమ్మక్క సారలమ్మ వన దేవతలను దర్శించుకున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఆసియా ఖండం లోనే అతి పెద్ద గిరిజన జాతర, తెలంగాణ రాష్ట్ర కుంభమేళా గా ప్రసిద్ధి చెందిన మేడారం లో వెలసిన సమ్మక్క, సారక్క పండుగ ను కేంద్రం ప్రభుత్వం తక్షణమే జాతీయ పండుగ గా ప్రకటించాలనీ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు. సోమ వారం మేడారం లో వెలసిన వన దేవతలు సమ్మక్క సారలమ్మ లను యాబై మంది బిసి కులాల రాష్ట్ర అధ్యక్షుల తో కలిసి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ ల జీవిత చరిత్ర, ను భౌవిష్యత్ తరాలకు చేర్చడానికి పాఠ్య పుస్తకాల హాలో చేర్చడంతో పాటు మొత్తంగా గ్రంథస్తం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్తగూడెం జిల్లాకు భద్రాద్రి జిల్లా అని భువనగిరి జిల్లాకు యాదాద్రి జిల్లా అని గద్వాల జిల్లాకు జోగులాంబ జిల్లా అని పేరు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లాకు సమ్మక్క సారలమ్మ పేరు ఎందుకు పెట్టడం లేదని తక్షణమే ములుగు జిల్లాకు సమ్మక్క సారలమ్మల జిల్లాగా పేరు పెట్టాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సమ్మక్క సారలమ్మల పౌరుషం, బహుజన వర్గాలు పుణికి పుచ్చుకోవాలని వారి స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీ ప్రజలైన బహుజనులకు రాజ్యాధికారం తగ్గాలని ఆ తల్లులను మొక్కుకున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే కోట్లాదిమంది తరలివచ్చే మేడారం జాతర ఏర్పాట్లు, పెద్దల నిర్మాణం అన్ని తానై దగ్గరుండి చూసుకుంటున్న సమ్మక్క సారమ్మల వారసురాలు రాష్ట్ర మంత్రి సీతక్కకు జాజుల శ్రీనివాస్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు సమ్మక్క సారలమ్మల ప్రతిరూపమే సీతక్క అని ఆయన కొనియాడారు. మేడారం దర్శనం కు వచ్చిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ బృందాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్వాగతించి శ్రీనివాస్ గౌడ్ శాలువాతో సత్కరించి అమ్మవార్ల ప్రసాదాలు వారికి అందజేశారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ వెంట రాష్ట్ర అధ్యక్షులు బైరి రవి కృష్ణ, గుజ్జ కృష్ణ, వరంగల్ శ్రీనివాస్, కుల్కచర్ల శ్రీనివాస్, యాదగిరి గౌడ్, తాటికొండ విక్రమ్ గౌడ్, బి మణి మంజరి, దాడి మల్లయ్య యాదవ్, నరసింహ నాయక్ వీర స్వామి, తారకేశ్వరీ, సంధ్యారాణి, శ్రీనివాస్ గౌడ్, సదానందం తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర భవిష్యత్తు కోసం బీజేపీలో చేరాలి

● సి అర్ పి సి, ఎవిడెన్స్‌లను గుర్తుచేసిన రామచందర్ రావు ● రైతులకు మహిళలకు మేలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

● యువ న్యాయవాదులకు కేంద్రంలో స్టాండింగ్ కౌన్సిల్‌లో అవకాశాలు దక్కాయి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలో పెద్దఎత్తున న్యాయవాదులు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో పెద్దఎత్తున జూనియర్ న్యాయవాదులు, సీనియర్ న్యాయవాదులు, అదేవిధంగా వారి బంధుమిత్రులు బిజెపిలో చేరడం సంతోషకరమని అన్నారు. భారతదేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం సుపరిపాలన, సంక్షేమ పథకాలు, కార్యక్రమాల పట్ల ఆకర్షితులై బుధవారం బిజెపిలో పెద్దఎత్తున చేరికలు జరిగాయని పేర్కొన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యం భారతదేశంపై పాలన చేయాలనుకున్న సమయంలో అనేక చట్టాలను తీసుకువచ్చింది. ఐపీసీ, సిఆర్పిసి ఎవిడెన్స్ యాక్ట్ వంటి చట్టాలు మనపై అమలు అయ్యాయని గుర్తు చేశారు. ఈ కోలోనియల్ మైండ్‌సెట్‌ను మార్చడానికి గతంలో ప్రభుత్వాలు ప్రయత్నించలేకపోయాయని గుర్తుచేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రిటిష్ కాలం నాటి చెల్లని చట్టాలను భారతీయ పద్ధతికి అనుగుణంగా మార్చడం జరిగిందని వెల్లడించారు. 1850 తర్వాత వచ్చిన కొన్ని బ్రిటిష్ చట్టాలను స్వతంత్ర భారత న్యాయ వ్యవస్థకు అనుకూలంగా మార్చారని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో వేగవంతమైన అభివృద్ధిని చూసి అడ్వకేట్లు, సమాజం దీనిని స్వాగతించారని ఆయన గుర్తుచేశారు. పెండింగ్ కేసులు పరిష్కరించడం, ఖాళీగా ఉన్న జడ్జ్ పోస్టులను వేగవంతంగా భర్తీ చేయడం మోదీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఖాళీగా ఉన్న జడ్జ్ పోస్టులను ఆలస్యం లేకుండా నింపడం జరుగుతున్నట్లు రాంచందర్ రావు గారు పేర్కొన్నారు. తెలంగాణలో దాదాపు 150 మంది యువ న్యాయవాదులు, ముఖ్యంగా సీనియర్ అడ్వకేట్లతో పాటు కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌లో అవకాశం పొందారని తెలిపారు.

వెనుకబడిన, పేద వర్గాలకు పెద్దపీట వేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయని, బీజేపీ అన్ని సీట్లలో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే పార్టీ లక్ష్యమని రాంచందర్ రావు తెలిపారు. రాష్ట్రంలో గతంలో ప్రజలు బీఆర్ఎస్‌కు, తరువాత కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని, కానీ రెండు పార్టీలు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచాయని విమర్శించారు. మాటలకే పరిమితమైన పాలన చేశారని, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఏ వర్గానికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయలేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ వ్యవస్థను 3040 శాతానికి పెంచిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల మధ్య కలహాలు, కాంట్రాక్టర్లు, కమిషన్ వ్యవస్థ రాష్ట్రంలో విస్తరించిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ పాలనలో తీవ్రంగా విఫలమయ్యాయని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కారణంగా బీహార్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో బీజేపీ విజయాలు సాధించిందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంతో మోదీ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి పునాది వేస్తామని అన్నారు. "సేవ్ తెలంగాణ ఓట్ ఫర్ బీజేపీ" నినాదంతో ప్రజలను కోరారు. న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ప్రొఫెషనల్స్ బీజేపీలో చేరి మద్దతు ప్రకటించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ భవిష్యత్తు కోసం మేధావులు ముందుకు రావాలని, విద్య, ఉద్యోగాలు, రైతు సంక్షేమంపై ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణను అభివృద్ధి రాష్ట్రంగా మార్చగలిగేది భారతీయ జనతా పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. పిల్లల భవిష్యత్తు, రైతుల జీవితం, రాష్ట్ర గౌరవం కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. దేశ భవిష్యత్తు, తెలంగాణ రక్షణ కోసం ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## ఫిబ్రవరి 3 నుంచి సీఎం రేవంత్ ప్రచారం



హైదరాబాద్‌: తెలంగాణలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూలు విడుదలైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించి, ఫిబ్రవరి 13 ఓట్ల లెక్కింపు చేపట్టి తుది ఫలితాలను వెల్లడిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. ఈ క్రమంలోనే మెజారిటీ స్థానాలకు కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ప్రతిపక్షాలకు గెలుపు అవకాశం ఇవ్వకుండా సీఎం రేవంత్ రెడ్డితో క్యాంపెయిన్‌కు ఆ పార్టీ తాజాగా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ఫిబ్రవరి 3న మిర్యాలగూడ సభతో రేవంత్ ప్రచారం ప్రారంభం కానుంది. అదేవిధంగా 4 జగిత్యాల, 5న చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్‌లో సీఎం రేవంత్ ప్రచార సభలు జరగనున్నాయి.

# అన్ని దారులు మేడారం వైపే

● మహాఘట్టానికి సిద్ధమైన మేడారం

● గద్దెలపైకి సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు

● ఏర్పాట్లు నిరంతరం పర్యేక్షిస్తున్న మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతరకు భక్తులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో అన్ని దారులు మేడారం వైపే వస్తున్నాయని, లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, మేడారం జాతరకు వచ్చే భక్తుల కోసం క్యూలైన్లను సక్రమంగా నిర్వహిస్తున్నామని, ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భక్తులకు నీడ కల్పించే విధంగా విస్తృతంగా షెడ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. తాగునీరు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నిన్న పోనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజు బయలుదేరారని, ప్రస్తుతం గోవింద రాజు కొండాయి నుంచి మేడారం చేరుకుని స్థానిక సారలమ్మ ఆలయంలో అలాయ్‌బలాయ్ స్వీకరిస్తున్నారని మంత్రి వివరించారు. ఈ రోజు సాయంత్రం 5 గంటలకు కన్నెపల్లె నుంచి సారలమ్మ మేడారానికి బయలుదేరుతారని తెలిపారు.

సాయంత్రం లక్షలాది మంది భక్తుల హర్షధ్వానాల మధ్య సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు గద్దెల మీదకు చేరుకునే ఘట్టం మహా ఘట్టమని సీతక్క పేర్కొన్నారు. రెండేళ్ల వానవాసం పూర్తి చేసుకుని తల్లులు జనవాసంలోకి ప్రవేశించే ఈ క్షణం భక్తులందరికీ అపూర్వమైన అనుభూతి అని అన్నారు ఇది తల్లులను దర్శించుకునే అరుదైన, గొప్ప అవకాశం. భక్తులందరూ కుటుంబ సమేతంగా భక్తి, శ్రద్ధతో పాటు బాధ్యతతో తల్లులను దర్శించుకోవాలి అని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

## భక్తులతో జన సంద్రంగా మారిన జంపన్న వాగు

**జంపన్న వాగులో భక్తుల పుణ్య స్నానాలు**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు వచ్చే భక్తులు జంపన్న వాగు లో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున జరిగే మహా జాతరకు వచ్చే భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించడం అనవాయితీ గా వస్తుంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు జంపన్న వాగులో ఇసుకతో వన దేవతల ప్రతిమలు ఏర్పాటు చేసి కొబ్బరి కాయ పసుపు కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శివ సత్తుల పునకాలతో జంపన్న వాగులో పదివేల దండలే తల్లి అబ్బిస్సా అంటూ సమ్మక్క తల్లికి పబ్బతి పడుతూ పుణ్య స్నానాల ఆచరించి వన దేవతలకు ఓడి బియ్యం బంగారం సమర్పించి తమ మొక్కలను చెల్లించి తమ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఇంటి ఇలవేల్పుగా ఆరాధిస్తున్నారు.

### రాజశ్యామల యాగంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని పోతిరెడ్డి పల్లి చౌరస్తా సమీపంలో దత్తగిరి ఆశ్రమం అధర్యంలో కల్యాణార్థం నిర్వహించిన శ్రీ రాజ శ్యామల యాగంలో పాల్గోన్నారు . ఈ సందర్భంగా దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ నేతృత్వం లో పండితులు , వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు తమ మంత్రోచ్చారణ తో రాజశ్యామల యాగం ను మంత్రి దామోదర్ రాజనర్సింహ చే నిర్వహించారు .అనంతరం పూర్ణహుతి కార్యక్రమం లో పాల్గోని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## అజిత్ పవార్ మృతికి మంత్రి సీతక్క సంతాపం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అకాల మరణం పట్ల మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అజిత్ పవార్ మరణం మహారాష్ట్ర రాజకీయాలకు, ప్రజా జీవితానికి తీరని నష్టమని ఆమె అన్నారు. ప్రజాసేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. . వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి ఇవ్వాలని ఆమె ఆకాంక్షించారు.




## సర్వజన హితం కోసమే రాజశ్యామల యాగం

**బీసీ కమిషన్ మాజీ చైర్మన్, వకుళాభరణం కృష్ణ మోహన్ రావు**



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఆధ్యాత్మిక భావనతో నిర్వహించే కార్యక్రమాలు సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని జరుగుతాయని తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. సనాతన ధర్మం, సంప్రదాయ ఆచారాలు, పూజా విధానాలు ప్రజలను సన్మార్గంలో నడిపించడానికే ఉద్దేశించబడ్డవని ఆయన స్పష్టం చేశారు. రాజశ్యామల యాగం వంటి యజ్ఞాలు, హోమ క్రతువులు సర్వజన హితాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్వహించబడతాయని తెలిపారు. ధర్మ పరిరక్షణ ద్వారా సమాజంలో శాంతి, శ్రేయస్సు నెలకొల్పడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జనవరి 19 నుంచి 28 వరకూ పది రోజుల పాటు రాజశ్యామల దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించగా, ఇవాళ పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ మహోత్సవాలు విద్యా శక్తి పీఠం ఆధిపతి నారాయణం చక్రవర్తుల శర్మ మార్గదర్శకత్వంలో నిర్వహించబడ్డాయి. కార్యక్రమాలు విద్యా శక్తి పీఠంలో, ఆర్కే పురం, హైదరాబాద్‌లో జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పీఠ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది. ముగింపు రోజైన ఇవాళ బుధవారం వేదపండితులు, ఘనపాఠులు ఆధ్వర్యంలో శాస్త్రోక్త విధానంలో యాగాంగ రంగా వైభవంగా పూర్ణాహుతి నిర్వహించబడింది. హోమాలు, యాగ క్రతువులు, పారాయణాలు వేదోక్తంగా జరిగాయి. పది రోజుల పాటు మహిళా భక్తుల విశేష పాల్గొనతో కుంకుమార్చన, విష్ణు అష్టోత్తర, సహస్రనామావళి పారాయణం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉపాసకులు రాంసుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం తీర్థ ప్రసాద స్వీకరణ తర్వాత, పీఠం ఆధ్వర్యంలో డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావును శాలువాతో సత్కరించి, లడ్డూ ప్రసాదం అందజేశారు.

## మున్సిపల్ ఎన్నికలపై బీజేపీ అధిష్టానం దిశా నిర్దేశం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన మున్సిపల్ మరియు కార్పొరేషన్ ఎన్నికల మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహారాష్ట్ర మంత్రి అండ్ ఎన్నికల ఇన్‌చార్జ్ అశీష్ షెలార్, రాజస్థాన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అండ్ కో-ఇన్‌చార్జ్ అశోక్ పర్ణామి, బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, బిజెపి సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఇతర నాయకులు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రానున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహం, అలాగే పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కమిటీ దిశానిర్దేశం చేసింది.

## అజిత్ పవార్ మృతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంతాపం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఇవాళ ఉదయం మహారాష్ట్రలోని బారామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో.. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. దాదాపు నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో.. ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి, రాజకీయాల్లో రాణిస్తూ డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగారు. మహారాష్ట్రకు సుదీర్ఘకాలం డిప్యూటీ సీఎంగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంపై పట్టు సంపాదించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. వారి అకాల మరణం, మహారాష్ట్ర ప్రజలకు, మహారాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్డీయే కూటమికి తీరని లోటని అన్నారు. తెలంగాణ ప్రజల తరపున, కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ తరపున వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. అజిత్ పవార్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

## సమ్మక్క సారలమ్మ జాతర శుభాకాంక్షలు



**తెలిపిన బీజేపీ నేత ఎన్ రామచందర్ రావు**

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ ప్రజల,హిందువుల, ఆదివాసీల ఆరాధ్య దైవాలు, సమ్మక్క సారలమ్మలు త్యాగానికి, ధైర్యానికి నిలువెత్తు ప్రతీకలు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటన విడుదల చేశారు. కొంగు బంగారమై కొలువైన మేడారం, కోట్లాది భక్తుల నమ్మకానికి నిలయం అని ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మల దీవెనలతో తెలంగాణ ప్రజలు శాంతి, సుసంపన్నంగా జీవిస్తూ, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు ప్రకటించారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఆటో యూనియన్ ల నాయకులతో బుధవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సమావేశం అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న రూ. 12 వేలు వెంటనే ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో ఇతర జిల్లాల ఆటో డ్రైవర్లకు ఇబ్బంది కలిగించటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అన్ని ఆటో సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. అవసరమైతే కార్మిక శాఖ మంత్రి ని కలుస్తామన్నారు. చట్టబద్ధమైన అనుమతులు ఉన్నప్పటికీ జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లను అడ్డుకోవటం సరికాదన్నారు. కార్మికుల భద్రతతో పాటు వారి ఉపాధి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో జిల్లాల నుంచి వచ్చే ఆటో డ్రైవర్లపై జరుగుతున్న దాడులు, వేధింపులు తక్షణమే అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కార్మికుల పక్షాన తెలంగాణ జాగృతి ఎప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ఆటో జాగృతి అధ్యక్షుడు ఎంఏ సలీమ్, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ఐ ఎన్ టీయూసీ జనరల్ సెక్రెటరీ మల్లేశం గౌడ్, టీ ఏడీఎస్ ప్రెసిడెంట్ సత్తిరెడ్డి, టీ ఎన్ టీయూసీ స్టేట్ ప్రెసిడెంట్ యాదగిరి, జీ యూ టీఎస్ అధ్యక్షులు శ్రీనివాస్, బీ ఆర్టీయూ అధ్యక్షుడు పరశురాముడు, తెలంగాణ జాగృతి నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజ్‌మెంట్

- రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం
- క్షేత్రస్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ ( డిజాస్టర్ మేనేజిమెంట్) విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ఫైర్ ? సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూవిపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్థితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. భారీ వర్షాలు వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగాలేకపోవడం వల్ల 2024 సంవత్సరంలో నా పాలేరు నియోజవకర్గంలో వాగుల్లో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్ అందుబాటులోకి తేవాలని సూచించారు. ఇప్పటికే ఈ వ్యవస్థ అందుబాటులో ఉంది. ఈ వ్యవస్థను క్షేత్రస్థాయి వరకు తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే హైదరాబాద్ నగరంలో హైరైజ్ భవనాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమీషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయని, ఒక్కో బృందంలో వెయ్యిమంది వరకు ఉన్నారని వీరందరికీ ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్,హైడ్రా కమీషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రి పొంగులేటి ఆరా :** మేడారం మహాజాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోటి భక్తుల కొంగు బంగారం, తెలంగాణ కుంభమేళా సమ్మక్క సారలమ్మ మేడారం జాతరలో అత్యంత పవిత్రమైన మొదటి ఘట్టం బుధవారం ప్రారంభమైన నేపధ్యంలో సచివాలయం నుండి హై ఫ్రీక్వెన్సీ వాకీటాకీతో మేడారంలో ట్రాఫిక్ విధులను పర్యవేక్షిస్తున్న సిబ్బందితో మంత్రిగారు మాట్లాడారు. తొలిరోజు కావడంతో భక్తుల సంఖ్య , సారలమ్మ వార్ల రాక ఏర్పాట్లు, సౌకర్యాల కల్పన, జాతరలో నెలకొన్న పరిస్థితులు గురించి మంత్రిగారు ఆరాతీశారు. ప్రజాప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తూ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రవాణా సౌకర్యాలు ఎప్పటికప్పుడు పరీక్షించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.

# జనారణ్యమైన మేడారం అటవీ ప్రాంతం

- ఇప్పటికే అమ్మవార్లను దర్శించుకున్న కోటి మంది భక్తులు
- చరిత్రలో నిలిచేలా మేడారంలో శాశ్వత వసతులు
- రూ.251 కోట్లతో సమ్మక్క సారలమ్మ మహాజాతర అభివృద్ధి పనులు
- రద్దీని తట్టుకునే క్యూ లైన్లు, శాశ్వత గద్దెలు, ఆధునిక వసతుల ఏర్పాటు శిలలపై ఆదివాసీ చరిత్ర



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతర గా గుర్తింపు పొందిన శ్రీ సమ్మక్కసారలమ్మ మేడారం మహాజాతర2026ను చరిత్రలో నిలిచిపోయేలా తెలంగాణ ప్రభుత్వం విస్తృత స్థాయిలో శాశ్వత అభివృద్ధి పనులు చేసింది. మొత్తం రూ.251 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు పూర్తి అయి భక్తుల మన్ననలు పొందుతున్నాయి. దీంతో భక్తుల సర్వత్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు మాఘ పౌర్ణమి సందర్భంగా జరిగే ఈ జాతరకు "తెలంగాణ కుంభమేళా"గా విశేష ఖ్యాతి ఉంది. లక్షలాది కాదు కోట్లాది మంది భక్తులు తరలివచ్చే ఈ మహాజాతర ఈసారి పునర్నిర్మాణ పనుల వల్ల మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

**2026 మహాజాతర తేదీలు**

నిన్న జనవరి 28 న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెప్రవేశించారు నేడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెప్రవేశం జనవరి 30న భక్తుల మొక్కులు చెల్లించనుండగా, జనవరి 31న వనప్రవేశంతో జాతర ముగియనుంది.

**తాత్కాలికం కాదు శాశ్వత నిర్మాణాలు**

గతంలో ప్రతి జాతర సందర్భంగా తాత్కాలిక వసతులతో సరిపెట్టిన పరిస్థితికి భిన్నంగా, ఈసారి వందల ఏళ్లపాటు నిలిచేలా పూర్తి రాతి కట్టడాలతో గద్దెల చుట్టు పునర్నిర్మాణం చేశారు. అది కూడా ఆదివాసీ పెద్దలు, పూజారుల సంఘం సంపూర్ణ ఆమోదంతోనే ప్రభుత్వం ఈ పనులు చేయడం విశేషం.

గద్దెల విస్తరణకు మాత్రమే రూ.101 కోట్లు. సుమారు 4,000 టన్నుల గ్రానైట్‌తో గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా నిర్మించారు. 46 స్తంభాలతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రాకారం, 8 స్తంభాలతో వృత్తాకార గద్దె, 50 అడుగుల వెడల్పుతో ప్రధాన స్వాగత తోరణం ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**శిలలపై ఆదివాసీ చరిత్ర**

మేడారం గద్దెల చుట్టూ నిర్మిస్తున్న 32 గ్రానైట్ పిల్లర్లపై ఆదివాసీ సంస్కృతి, ఆచారాలు, జీవనశైలి, కోయ వంశ చరిత్రను శిల్పాల రూపంలో చెక్కించారు. 930 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల ఆధారంగా రూపొందించిన ఈ శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్నతో పాటు ప్రకృతిలో మమేకమై జీవించే ఆదివాసుల జీవన వైవిధ్యాన్ని ప్రతిబింబించే పులి, జింక, ఏనుగు, నెమలి వంటి వన్యప్రాణుల ప్రతిరూపాలు చెక్కించారు. సుమారు 750 కోయ ఇంటి పేర్లు, 7,000కు పైగా శిల్పాలు గిరిజన చరిత్రను భావితరాలకు తెలియజేసేలా రూపొందించారు.

**రహదారులు, క్యూ లైన్లు, పార్కింగ్**

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 60 అడుగుల నుంచి నాలుగు లైన్ల రోడ్ల విస్తరణ, శాస్త్రీయ క్యూ లైన్లు, వాచ్ టవర్లు, సత్రాలు ఏర్పాటు చేశారు.

పార్కింగ్ సమస్య తలెత్తకుండా 42 ప్రదేశాల్లో 1,418 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. జనారణ్యమైన ములుగు అటవీ ప్రాంతం మేడారం చేరే అన్ని రహదారులు వాహనాల రాకపోకలు, భక్తుల గుడారలతో ములుగు అటవీ ప్రాంతం నిండిపోయింది. ముఖ్యం గా తాడ్వాయి మడలం గత నెల రోజుల నుండి రద్దీగా గా మారింది. గత జాతరకు సుమారు రెండు కోట్ల మంది భక్తులు హాజరవ్వగా, ఈసారి మూడు కోట్ల మంది వస్తారని అంచనా. గత నెల రోజుల నుండి దాదాపు 1 కోటి మందికి పైగా భక్తులు సమ్మక్క సారలమ్మ అమ్మ వార్లను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో జాతర నిర్వహణ పగడ్బందీగా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. మొత్తం 21 శాఖల సమన్వయంతో 42,027 మంది అధికారులు, సిబ్బందిని విధులు నిర్వహిస్తున్నారు. జాతర ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక అధికారులను నియమించారు. అన్నీ సెక్టార్ లకు వాకీ టాకీ లను ఏర్పాటు చేసి సెక్టార్ వారీగా ఏ ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయం తో పని చేస్తున్నారు.

**రవాణా, వైద్య, భద్రతా చర్యలు :** టీజీఎస్‌ఆర్టీసీ ద్వారా 4,000 బస్సులు, 51,000 ట్రిప్పులు నడిపిస్తోంది. వైద్య సేవల కోసం 108 అంబులెన్సులు, బైక్ అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన ఆసుపత్రి ద్వారా ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందిస్తున్నారు. స్పెషలైస్ట్ డాక్టర్స్ మందులు అన్నీ అందుబాటులో ఉంచారు. అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, జంపన్నవాగులో ఈతగాళ్లను మోహరించారు. జంపన్న వాగులో భక్తులు ప్రమాదం బారిన పడకుండా చర్యలు తీసుకున్నారు.

**డిజిటల్ మేడారం :** డిజిటల్ యుగంలో మేడారం సమాచారాన్ని అందించేందుకు డిజిటల్ వేదికను జిల్లా యంత్రాంగం ఎచుకుంది. భక్తుల సౌకర్యం కోసం మేడారం జాతర 2026 మొబైల్ యాప్, అధికారిక వెబ్‌సైట్, ' మై మేడారం ' వాట్సాప్ చాట్‌బాట్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. భక్తులకు మేడారం జాతర పూర్తి సమాచారం డిజిటల్ ప్లాట్ ఫామ్ అందిస్తున్నారు. పార్కింగ్, వైద్య శిబిరాలు, టాయిలెట్లు, ఎస్ఓఎస్ సేవలు, మిస్సింగ్ పర్సన్స్ వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

**ప్లాస్టిక్ రహిత జాతర :** అరణ్యమే ఆలయం ప్రకృతే దేవత అన్న ఆదివాసీ తత్వానికి అనుగుణంగా ఈసారి ప్లాస్టిక్ రహిత మేడారం నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భక్తుడి పై వుందని మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క పర్యవేక్షణలో, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సారథ్యంలో ఈసారి మేడారం మహాజాతరను ప్రపంచ స్థాయిలో ఆదర్శంగా నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

# రాష్ట్రంలో మరో భారీ కుంభకోణం..

**సంచలన ఆరోపణలు చేసిన హరీశ్ రావు**



హైదరాబాద్ : తెలంగాణలో మరో కొత్త స్కామ్ జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. అబ్కారీ శాఖలో ఓ ముఖ్యనేత, మంత్రి కోటా కింద అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇవాళ మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన హరీశ్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్ కు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని ఇందుకోసం 110 అప్లికేషన్లు వస్తే తొలుత 25 ఇవ్వబోతున్నట్లు చెప్పారు. అయితే ఇందులో మంత్రి కోట 4, మరో ముఖ్య నేత కోట కింద 21 మైక్రో బెవరేజులను సెలెక్ట్ చేసుకున్నారని పంచుకున్నారని ఆరోపించారు. ఈ మధ్య ముఖ్య నేతకు తోడై, నీడై, ఇంట్లోనే ఆ నాయకుడు ఉంటున్నాడని.. ఈ మధ్య వార్తల్లో కూడా ఉన్నారని ఆరోపించారు. కారు నేరుగా ముఖ్య నేత ఇంట్లోకి వెళ్తుందని, ఈ మధ్య ఈ ముఖ్య నేత తిరుపతి వెళ్తే సదరు నేత నీడగా వెంటే ఉన్నాడని ఆరోపించారు. ఒక్కో బ్రేవరీకి 1.80 కోట్లుగా ధర నిర్ణయించారని ఇందులో రూ.ఒకటిన్నర కోటి ముఖ్యనేతకు, మిగతా రూ.30 లక్షలు తోడు నీడ కు అని ఆరోపించారు. 21 తోడు నీడ ఫైనల్ చేసుకుంటే 4 మంత్రి ఫైనల్ చేసుకున్నారన్నారు. మైక్రో బేవరేజీల కోసం 110అప్లికేషన్లు వచ్చాయని అంటున్నారని అలాంటప్పుడు వైన్స్ లకు లాటరీ తీసినట్టు వీటికి ఎందుకు లాటరీ తీయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా లిక్కర్ సరఫరా చేసే సంస్థలకు 4500కోట్లు బకాయిలు పడ్డారని, కొన్ని బకాయిలు 16 నెలలకు పైబడి ఉన్నాయన్నారు. గతంలో ఎన్నడు కూడా ఈ విధమైన పరిస్థితి లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 15 రోజుల్లో చెల్లింపులు జరిగేవన్నారు. బకాయిల వల్ల సరఫరా ఆగిపోయిందని దీంతో చాలా షాప్‌లలో సరుకు అందుబాటులో లేకుండా పోతోందన్నారు. ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు కూడా సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించాయని లేఖలు కూడా రాశాయన్నారు. వాటాల పంపకాల్లో తేడాతోనే బకాయిలు నిలిచిపోయాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరికొన్ని బ్రాండ్స్ నిలిపివేసే పరిస్థితి ఉన్నదని దీనితో ప్రభుత్వం ఆదాయం పడిపోతోందన్నారు. ఇప్పటికే హాలోగ్రామ్ టెండర్ల విషయంలో ముఖ్య నేత అల్లుడుకి, మంత్రి కొడుక్కి కావాలని పట్టుపట్టారని ఆరోపించారు.

**బీఆర్ఎస్ అభ్యంతరంబీర్ కంపెనీలకు ఉన్న ప్రాధాన్యత రైతులకు లేదు**

ఈ ప్రభుత్వం బీర్ కంపెనీలకు ఇచ్చిన ప్రాధాన్యత రైతులకు ఇవ్వడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. మీకు బీర్ల కంపెనీలు ముఖ్యమా... రైతులు ముఖ్యమా అంటే బీరు కంపెనీలే ముఖ్యం అంటున్నారని ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా సింగూరు డ్యాం రిపేర్ పేరు మీద రైతులకు క్రాఫ్ హాలిడే ప్రకటించారని ఈ ప్రాజెక్టు కింద. 40వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్ట కింద 30వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. ఇదే సంగారెడ్డి జిల్లాలో ఉన్న బీరు కంపెనీలకు మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా నీటి సరఫలా జరుగుతోందని ఇది మద్యం తయారీదారు ప్రభుత్వమా? లేక రైతు ప్రభుత్వమా? అని నిలదీశారు. అబ్కారీ శాఖ స్పెషల్ సీఎస్ సంగారెడ్డి జిల్లాకు వెళ్లి నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై రైతులకు నీటి సప్లై ఆపి బీర్ల కంపెనీలకు నీటి కొరత రాకుండా చూడండని ఆదేశించారని ఆరోపించారు.

# మార్చి నెలలో అఖిల భారత పోలీస్ ఫుట్ బాల్ సమరం

**డిజీపీ బి.శివధర్ రెడ్డి**



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : 74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. డిజిపి కార్యాలయంలో బుధవారం నాడు జరిగిన సమావేశంలో డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గతంలో చక్కని ఫుట్ బాల్ క్రీడాకారులు ఉండేవారని, 1956వ సంవత్సరంలో జరిగిన మెల్బోర్న్ ఒలింపిక్స్ లో సెమీఫైనల్ చేరిన భారత ఫుట్ బాల్ జట్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు నూర్ మొహమ్మద్, జుల్ఫీకరుద్దీన్, అహ్మద్ హుసేన్, అజీజుద్దీన్, బలరాం, తంగరాజ్, వంటివారు పాల్గొన్నారన్నారు. వీరిలో అయిదుగురు హైదరాబాద్ సిటీ పోలీస్ వారు. ఆ జట్టు కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ కూడా హైదరాబాదీయేనని తెలిపారు. కాలక్రమేనా పోలీసు ఉద్యోగుల్లో ఫుట్ బాల్ క్రీడ పట్ల ఆసక్తి సన్నగిల్లిందని అభిప్రాయపడ్డారు. 74 వ బీ.ఎన్.మల్లిక్ అఖిల భారత ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించే అవకాశం ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు వచ్చిందన్నారు. ఛాంపియన్ షిప్ పోటీల పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ ఈ ఏడాది మార్చి 23 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు హైదరాబాదులో నిర్వహించనున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు, 11 కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు మరియు 6 కేంద్ర పోలీస్ సంస్థల నుంచి మొత్తం 53 జట్లు ఈ క్రీడా సమరంలో పాల్గొంటాయని డిజిపి తెలిపారు. సుమారు 1060 మంది పురుష క్రీడాకారులు, 350 మంది మహిళా క్రీడాకారులు, కోచ్‌లు, రిఫరీలు మరియు ఇతర అధికారులతో కలిపి మొత్తం 2000 మందికి పైగా ప్రతినిధులు ఈ వేడుకలో భాగస్వాములు కాబోతున్నారన్నారు. మొత్తం 12 రోజుల పాటు సాగే ఈ ఛాంపియన్‌షిప్‌లో 125 మ్యాచ్‌లను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, అజీజ్ నగర్‌లోని ఎచ్ఎఫ్‌సి గ్రౌండ్, మొయినాబాద్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ మైదానాలతో పాటు మరికొన్ని ప్రధాన మైదానాల్లో ఈ పోటీలు జరగనున్నాయన్నారు.

ఈ మెగా ఈవెంట్ నిర్వహణకు తాను చైర్మన్ గాను, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా , అడ్మినిస్ట్రేషన్ కమిటీలో ఐపిఎస్ అధికారులు అభిలాషా బిస్త్, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, వి.సి. సజ్జనార్, అవినాష్ మహంతి, గజరావు భూపాల్ వంటి సీనియర్ అధికారులు వివిధ బాధ్యతలను నిర్వహిస్తారన్నారు. మార్చి 23న జట్ల రిపోర్టింగ్ తో ప్రారంభమయ్యే ఈ క్రీడల షెడ్యూల్‌లో భాగంగా మార్చి 25న మధ్యాహ్నం 3 గంటలకు అధికారికంగా ఆరంభ వేడుకలు జరగనున్నాయని, ఏప్రిల్ 5న తుది పోరు అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ముగింపు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నీ కోసం తెలంగాణ పోలీస్ అకాడమీలో క్రీడాకారులందరికీ వసతి సౌకర్యాలు కల్పించడమే కాకుండా, జట్ల రాకపోకల కోసం 45 ప్రత్యేక బస్సులు మరియు అధికారుల కోసం ఇతర వాహనాలను సిద్ధం చేస్తామని, క్రీడాకారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రతి గ్రౌండ్ వద్ద ఒక అంబులెన్స్ తో పాటు వైద్య బృందం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సాంకేతికపరంగా ఈ టోర్నీని పారదర్శకంగా నిర్వహించేందుకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ నుండి 40 మంది ప్రతినిధులు మరియు రిఫరీలు హాజరవుతున్నారనీ, మ్యాచ్‌ల సమయంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి జ్యూరీ ఆఫ్ అప్పీల్స్ కమిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడా పోటీలకు సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ నుంచే ప్రత్యేక కంట్రోల్ రూమ్ అందుబాటులోకి వస్తుందని, అఖిల భారత స్థాయి పోటీలు రాష్ట్ర ప్రతిష్టను చాటిచెప్పేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. అడిషనల్ డిజిపి అనిల్ కుమార్, మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, స్పోర్ట్స్ ఐజిపి డాక్టర్ గజరావు భూపాల్, హైదరాబాద్ శాంతిభద్రతల అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి ఎన్.శ్వేత, విజిలెన్స్ డిఐజి అభిషేక్ మహంతి, యూసఫ్ గూడా బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త.. రేపో, మాపో ఉత్తర్వులు జారీ




హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా 2026 కార్యక్రమంలో ఏక్సీ ఏరోస్పేస్ గ్రూప్ తన కొత్త కార్గో డ్రోన్ 'స్ట్రైక్సిప్టర్' మరియు అత్యాధునిక స్పాట్ డ్రోన్ 'స్పైరింగ్ 90'ను పరిచయం చేసింది. స్పైక్సిప్టర్ 52 కిలోల గరిష్ఠ తూకంతో 30 కిలోల వరకు సరుకు తీసుకెళ్లగలదు మరియు 45 నిమిషాల ఎగురగలదు. ఇది వాణిజ్య, వైద్య మరియు పరిశ్రమల లాజిస్టిక్స్ అవసరాలకు అనుకూలంగా ఉ ంది. స్పైరింగ్ 90 క్వాడ్‌కాప్టర్ రూపంలో ఉండి విలువైన స్థాయి పరిశీలన, గూఢచర్య కోసం రూపొందించబడింది. ఈ డ్రోన్లు ఏక్సీ ఏరోస్పేస్ యొక్క స్వంత శైలిలో ఆటోపైలట్ మరియు లిథియం స్మార్ట్ బ్యాటరీలతో పనిచేస్తాయి. కార్యక్రమంలో కంపెనీ స్థానిక యువత మానవ సామర్థ్యాలను, అగ్రి ఎయి డ్రోన్ పరిష్కారాలను కూడా ప్రదర్శిస్తోంది, తద్వారా భారతదేశంలో స్వదేశీ డ్రోన్ తయారీ సామర్థ్యాలను ప్రపంచానికి చూపిస్తోంది.

## ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్: సైబర్ భద్రత అవసరం

ప్రస్తుత కాలంలో మన జీవితంలోని చాలా కార్యకలాపాలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నప్పటికీ, సైబర్ దాడులు మరియు మోసాలు వేగంగా పెరుగుతున్నాయి. వ్యక్తిగత డేటా దుర్వినియోగం, గుర్తింపు కబ్జా చేయడం, ఆర్థిక లావాదేవీలను అవినీతి చేయడం వంటి ప్రమాదాల నుండి రక్షణ పొందడం అత్యంత అవసరం. భారతదేశంలో డిజిటల్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది, మరియు ఆన్‌లైన్ లావాదేవీల వృద్ధితో సైబర్ మోసాల పరిమాణం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ సైబర్ ఇన్సూరెన్స్ ద్వారా వ్యక్తుల, కుటుంబాల ఆర్థిక భద్రత, డేటా రికవరీ, న్యాయ సహాయం మరియు మానసిక మద్దతు వంటి విస్తృత రక్షణను అందిస్తుంది. సైబర్ వాల్యూట్ పాలసీ ద్వారా సైబర్ ప్రమాదాల నుండి మొత్తం కుటుంబానికి భరోసా మరియు సురక్షిత డిజిటల్ అనుభవాన్ని కల్పించడం సాధ్యమవుతుంది.

## హైదరాబాదులో సుజుకి మత్సురి ఉత్సవం




హైదరాబాద్‌లో సుజుకి మోటార్‌సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 'సుజుకి మత్సురి' ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించింది, ఇందులో 3,700కి పైగా రైడర్లు మరియు వినియోగదారులు పాల్గొన్నారు. ఈ ఒకరోజు ఈవెంట్ రైడింగ్ అనుభవాలు, టెస్ట్ రైడ్స్, నిపుణులతో సంభాషణలు, ప్రదర్శనలు, కళా కార్యకలాపాలు, సంగీత ప్రదర్శనలు మరియు లక్కీ డ్రా వంటి అనేక ఆకర్షణీయ కార్యక్రమాలను అందించింది. 10 మిలియన్ల యూనిట్ ఉత్పత్తి లక్ష్యం మరియు కొత్త సుజుకి ఇ-యాక్సెస్ మోడల్ విడుదలను జరుపుకుంటూ, ఈ ఉత్సవం వినియోగదారులతో సుజుకి బ్రాండ్ అనుబంధాన్ని మరింత బలపరిచింది. పాల్గొనేవారికి సుజుకి అసలైన ఉపకరణాలు, మొ-డ్యూలర్ మరియు ఉచిత సర్వీస్ చెకప్‌లు కూడా అందించబడ్డాయి, అందువల్ల మోటార్‌సైకిల్ ప్రేమికులకు పూర్తి ఫెస్టివ్ అనుభవాన్ని అస్వాదించారు.

## మైండ్‌స్పేస్ ఆర్‌ఈఐటీ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు

మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ ఆర్‌ఈఐటీ క్యూ3ఎఫ్వై26లో సుస్థిర వృద్ధిని నమోదు చేసింది, నికర ఆపరేటింగ్ ఆదాయం 28.7% పెరిగి ₹671 కోట్లు చేరింది. మొత్తం లీజింగ్ 1.1 మిలియన్ చ.అ.గా నమోదై, కట్టుబడిన ఆక్యుపెన్సీ 94.5% వద్ద ఉంది. విస్తరించిన మైక్రో మార్కెట్లలో, ముఖ్యంగా హైదరాబాద్ మాదాపూర్‌లో అద్దె వృద్ధి సాధించబడింది. ఈ త్రైమాసికంలో ₹378 కోట్ల విభజన ప్రకటించబడింది, యూనిట్ పైన 9.6%సంవత్సరానికి పెరుగుదలతో. ముంబై మరియు పూణే లో సిడీఈ ఆస్తుల 0.8 మి.చ.అం. కొనుగోలు ద్వారా పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించబడింది, అందువలన మొత్తం ఆస్తుల విలువ ₹44,136 కోట్లు చేరింది. మొత్తం ఫలితాలు ఆర్‌ఈఐటీ యొక్క స్థిర ఆర్థిక స్థితి, ఆక్యుపెన్సీ మరియు యూనిహోల్డర్లకు విలువను అందించే లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతున్నాయి.




# గత పదేళ్లలో 25 కోట్లమందికి పేదరికం నుంచి విముక్తి

**: బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి - పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం**



న్యూఢిల్లీ : పేదల కోసం 4 కోట్ల ఇళ్లు నిర్మించామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. గత పదేళ్లలో 25 కోట్లమందిని పేదరికం నుంచి విముక్తి కల్పించామని చెప్పారు. ఇంకా 100 కోట్లకుపైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని వెల్లడించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రస్తావించిన రాష్ట్రపతి, బిర్సాముండా, సర్దార్ పటేల్‌కు నివాళులు అర్పించారు. వీరితో పాటు భారతరత్న భూపేన్ హజారికా శతజయంతి సందర్భంగా స్మరించారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం అందరికీ అందాలని అంబేద్కర్ ఆకాంక్షించారని గుర్తు చేశారు. వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు విస్తరించామని, ప్రస్తుతం దేశంలో 150కిపైగా వందేభారత్ రైళ్లు ఉన్నాయని తెలిపారు. భారత్ తన సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకోబోతోందని వెల్లడించారు.వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో నిలిచింది. తయారీ రంగంలోనూ మంచి ప్రగతి నమోదవుతోంది. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లోనూ భారత్ దూసుకెళ్తోంది. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. సామాజిక న్యాయసాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా డబ్బు జమ. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లమందికి వైద్యసేవలు అందిస్తున్నాం. సికిల్ సెల్ వంటి వ్యాధులపై పోరాటం సాగిస్తున్నాం. కరోనా తర్వాత బీమాపై ప్రజల్లో అవగాహన పెరిగింది. వికసిత్ భారత్‌లో రైతులు, మహిళలు, యువతది కీలకపాత్ర. జల్‌జీవన్ మిషన్ ద్వారా కోట్లమందికి తాగునీరు అందిస్తున్నాం. దేశంలో స్పేస్ టూరిజం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అని రాష్ట్రపతి --ద్రౌపదీ ముర్ము, అన్నారు.

**పవర్ టెక్నాలజీ హబ్‌గా భారత్**

ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడంపై దేశప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పన్ను సంస్కరణలు రూపొందుతున్నాయన్నారు. దేశం పవర్ టెక్నాలజీ హబ్‌గా రూపొందుతోందని, దేశ అణువిద్యుత్ సామర్థ్యం క్రమంగా పెరుగుతోందన్నారు. అవినీతి కట్టడి ద్వారా ప్రభుత్వం ప్రజాధనాన్ని సద్వినియోగం చేస్తోందని చెప్పారు. స్టార్టప్ ఎకో సిస్టమ్‌లో భారత్ మూడోస్థానంలో నిలిచింది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద స్టార్టప్ కేంద్రంగా భారత్ నిలిచింది. కొత్తగా 25 లక్షల సంస్థలు స్టార్టప్‌లుగా నమోదయ్యాయి. ఐటీ, జీసీసీ రంగంలో కొత్త ఉద్యోగాలు భారీగా పెరిగాయి. ఐటీ, ఐటీఈఎస్ రంగాలు కోట్లమందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా జాతీయ విద్యా విధానం తీసుకువచ్చాం. దేశంలో లక్షన్నర అటల్ టింక్లరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశాం. 2030లో కామన్వెల్త్ క్రీడల నిర్వహణకు భారత్ సిద్ధంగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ దేశాలకు భారత్ ఒక వారధిగా ఉంది. అంతర్జాతీయ సంక్షోభాల నివారణలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. 1500 ఏళ్ల తర్వాత సోమ్‌నాథ్ ఆలయాన్ని పునర్ నిర్మించుకున్నాం. ప్రాచీన చరిత్ర, ఆధారాలను డిజిటలీకరణ చేస్తున్నాం. ఈశాన్య భారతంలో వైద్యరంగంలో మౌలిక సదుపాయాలు పెంచాం. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోంది. వికసిత్ భారత్‌లో రైతుకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చాం. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నాం. రైతుకు దన్నుగా నిలిచేందుకు ఆహార శుద్ధి రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. అని రాష్ట్రపతి --ద్రౌపదీ ముర్ము, అన్నారు.

గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టం తీసుకొచ్చాం. దేశాభివృద్ధిలో మహిళలకు కీలకపాత్ర కల్పించాం. ఆపరేషన్ సిందూర్ మన సైన్యం సత్తా చాటింది. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం మొత్తం చూసింది. వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం. నానో చిప్‌ల తయారీపైనా భారత్ దృష్టి సారించింది. మైక్రో చిప్‌ల తయారీలో స్వయంసమృద్ధి సాధించాలి. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో 15 లక్షల ఉద్యోగాలు సృష్టించగలిగాం. ముద్ర యోజన ద్వారా చిరువ్యాపారులకు భారీగా రుణాలు ఇచ్చాం. పీఎం విశ్వకర్మ జన ద్వారా 20 లక్షల మందికి శిక్షణ ఇచ్చాం. 95 కోట్లమందికిపైగా సామాజిక భద్రత కల్పించాం అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు.

---

**పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు**

## చూపు పోయే ముప్పు..!

న్యూఢిల్లీ : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. తమ నేతకు వెంటనే చికిత్స అందించకపోతే.. కంటిచూపు పోయే ప్రమాదం ఉందని పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం..ఇమ్రాన్‌ఖాన్ కుడి కంటిలో సమస్య తలెత్తిందని, దానికి వెంటనే చికిత్స అందించకపోతే చూపుపోయే ప్రమాదం ఉందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేశాయి. వైద్యుల సూచనను పట్టించుకోకుండా జైల్లోనే ఆయనకు చికిత్స అందించాలని జైలు అధికారులు పట్టుబడుతున్నారని ఆరోపించాయి. 2024 అక్టోబర్‌లో ఇమ్రాన్ తన వ్యక్తిగత వైద్యుడి వద్ద పరీక్షలు చేయించుకున్నారని, ఆ తర్వాత నుంచి ఆ డాక్టర్‌ను కలిసేందుకు అనుమతించడం లేదని వెల్లడించాయి.

---

# పైలట్ల నుంచి మేడే కాల్ రాలేదు

- **అజిత్ పవార్ విమాన ప్రమాదంపై ఏఏఐబీ దర్యాప్తు**
- **పవార్ మృతిలో కుట్రకోణం ఉందటూ మమతా బెనర్జీ అనుమానం**



ముంబై: మహారాష్ట్రలోని బారామతి విమాన ప్రమాదంపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు చేపట్టనుంది. ఘటనా స్థలాన్ని ఏఏఐబీ బృందం త్వరలోనే సందర్శిస్తుందని, ఈ ప్రమాదంపై దర్యాప్తు చేపడు తుందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. మరోవైపు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయడు కూడా ఘటనాస్థలికి పరిశీలించనున్నారు. అందుకోసం పౌర విమానయాన శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో కలిసి పుణెకు బయలుదేరారు. ఇదిలా ఈ ఘటనపై విచారణ చేపడతామని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే తెలిపారు.

దర్యాప్తులో భాగంగా ఫ్లైట్ రికార్డర్, ఎన్హాన్స్ గ్రౌండ్ ప్రాక్సిమిటీ వార్నింగ్ సిస్టమ్(ఈజీపీడబ్ల్యూఎస్)ను డిజిటల్ ఇంజిన్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ను స్వాధీనం చేసుకోనుంది. అలాగే ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ లాగ్‌బుక్స్, వర్క్ ఆర్డర్లు, ఆన్‌బోర్డ్ డాక్యుమెంట్లు, ప్రధాన తనిఖీ రికార్డులను ఆపరేటర్ నుంచి సేకరించి పరిశీలించనున్నారు. సిబ్బంది, విమానానికి సంబంధించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పత్రాలను కూడా దర్యాప్తు బృందం కోరింది. అదనంగా, రాడార్ డేటా రికార్డింగ్స్, సీసీటీవీ ఫుటేజ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టేప్ రికార్డింగ్స్, హాట్‌లైన్ కమ్యూనికేషన్లను సేకరించి విశ్లేషించనున్నారు. సాక్షులు, సంబంధిత సిబ్బంది వాంగ్మూలాలను కూడా నమోదు చేయనున్నారు.

అటు పైలట్ల నుంచి మేడే కాల్ రాలేదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ఘటన సమయంలో రన్‌వే గుర్తించడంలో పైలట్లు ఇబ్బంది పడినట్లు వివరించింది. తొలి ప్రయత్నంలో రన్‌వే కనిపించకపోవడంతో గాల్లోనే కాసేపు చక్కర్లు కొట్టిందని, రెండో ప్రయత్నంలో లాండ్ అయ్యేందుకు ప్రయత్నించి విఫలమైనట్లు డీజీసీఏ పేర్కొంది.

**భవిష్యత్లో పునరావృతం కాకుండా దర్యాప్తు చేపడతాం : ఏక్నాథ్ శిందే**

విమాన ప్రమాదం చాలా బాధాకరమైన ఘటన అని ఉపముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే తెలిపారు. మహారాష్ట్రకు చాలా దురదృష్టకరమైనది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుకండా ఉండటానికి విమాన ప్రమాదంపై దర్యాప్తు జరుపుతాం. ఈ నష్టం కేవలం పవార్ కుటుంబానికే కాదు మొత్తం రాష్ట్రానిది. మహారాష్ట్ర పురోగతి కోసం నేను ఆయన ఒక జట్టుగా పనిచేశాం. ఇప్పుడు నేను నా అన్నయ్యను కోల్పోయినట్లు అనిపిస్తోంది. అజిత్ పవార్ స్పష్టంగా నేరుగా మాట్లాడే వ్యక్తి. కష్టపడే నాయకుడు. నిబద్ధతతో పనిచేసేవారు. చూద్దాం, ఆలోచిద్దాం వంటి మాటలు ఆయన ఉపయోగించేవారు కాదు. ఏ పని చేయాలనుకున్నా వెంటనే చేసేవారు. బయటకు కఠినంగా కనిపించినా, ఆయనది చాలా మనసు అని ఏక్నాథ్ శిందే అన్నారు.

**పవార్ మృతిలో కుట్రకోణం ఉందటూ మమతా బెనర్జీ అనుమానం**

మరోవైపు విమాన ప్రమాదంపై బంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. పవార్ మృతిలో కుట్రకోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. పవార్ మరణ వార్త విని తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు. ఈ ప్రమాదం దేశంలోని రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతుందని తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం పైనే తమకు నమ్మకం ఉందని చెప్పారు. మరే ఇతర దర్యాప్తు సంస్థల పైనా తమకు విశ్వాసం లేదని, అవి వాటి స్వేచ్ఛను కోల్పోయాయని విమర్శించారు. ఈ సందర్భంగా పవార్ బీజేపీని వీడాలని ఆలోచిస్తున్నారని ఇటీవల జరిగిన ప్రచారం గురించి మమత గుర్తు చేశారు.

**విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తునకు నేతల డిమాండ్**

అటు, మమతతో పాటు పవార్ విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని పలువురు రాజకీయ నాయకులు కూడా డిమాండ్ చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌లు పవార్ మృతికి సంతాపం తెలిపారు. ఈ ఘటనపై పారదర్శకమైన దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

---



# 2027 ఫిబ్రవరిలో దేశంలో కుల గణన

- **గతంలో మాదిరిగానే రెండు దశల్లో జనాభా లెక్కింపు**
- **మంచు రాష్ట్రాల్లో 2026 సెప్టెంబర్లో నిర్వహణ**
- **2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్న కులగణన**

న్యూఢిల్లీ : జనగణన ప్రక్రియలో భాగంగా కుల గణనను రెండో దశలో చేపట్టనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అయితే, మంచు ప్రభావిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో మాత్రం 2026 సెప్టెంబర్లోనే కుల గణన జరుగుతుందని వివరించింది. ఈ మేరకు 2027 జనాభా లెక్కలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హూం మంత్రిత్వ శాఖ ఓ కీలక ప్రకటన విడుదల చేసింది.గతంలో విడుదల చేసిన ప్రకటనను ఉటంకిస్తూ, జనగణన-2027కు సంబంధించిన పూర్తి వివరాలను 2025 డిసెంబర్ 12న విడుదల చేసిన ప్రెస్నోట్లో తెలియజేశాం. కానీ జన గణన, కుల గణనపై కొందరు కావాలనే గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. జన గణన రెండు దశల్లో జరుగుతుందని, కుల గణన రెండో దశలో భాగంగా ఉంటుందని మేము ఇప్పటికే స్పష్టం చేశాం అని కేంద్ర హోంశాఖ పేర్కొంది. అంతేకాదు గతంలో నిర్వహించిన జనాభా లెక్కల మాదిరిగానే. ఈసారి కూడా మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహాల గణన జరుగుతుంది. రెండో దశలో జనాభా గణన జరుగుతుందని స్పష్టం చేసింది.

**మొదటి దశ ప్రశ్నల వివరాలు :** ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న మొదటి దశ కోసం కేంద్ర ప్రభుత్వం జనవరి 22న 33 ప్రశ్నలతో కూడిన జాబితాను నోటిఫై చేసింది. దీని ప్రకారం, గృహ నిర్మాణం కోసం వాటిని ముడిసరకు, ఇంట్లో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య, కుటుంబ యజమాని లింగం, తీసుకునే ఆహార పదార్థాల వివరాలు, ప్రాథమిక, అత్యవసరాల లభ్యత, వాహనాల రకాలు మొదలైన ప్రశ్నలు అడగనున్నారు. అంతేకాదు కుటుంబ యజమాని పేరు, లింగం, యజమాని ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర వర్గాలకు చెందినవారా? నివసిస్తున్న ఇల్లు సొంతదా, కాదా? మొదలైన వివరాలు కూడా సేకరిస్తారు.ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య ప్రతి రాష్ట్రం కేటాయించిన 30 రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంటుంది. అలాగే, స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్-ఎన్యుమరేషన్) కూడా 15 రోజుల పాటు అవకాశం కల్పిస్తారు.

**ప్రతిపక్షాల విమర్శలు :** మరోవైపు కుల గణనపై కేంద్రం జారీ చేసిన ప్రశ్న పత్రావళిని సమాజ్వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. బీజేపీకి కుల గణన చేసే ఉద్దేశం లేదని, వెనుకబడిన వర్గాలను, దళితులను, మైనారిటీ వర్గాలను ఆ పార్టీ వంచిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నోటిఫికేషన్లో కులం కోసం ప్రత్యేక కాలమ్ లేదు. మరి వారు దేనిని లెక్కిస్తారు? కుల గణన అనేది బీజేపీకి ఒక జుమ్లా (ఒట్టి మాట) మాత్రమే అని ఎక్స్ వేదికగా అఖిలేశ్ యాదవ్ విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ కూడా ఈ అంశంపై స్పందించారు. గృహాల జాబితా షెడ్యూల్లో 12వ ప్రశ్న - యజమాని ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర వర్గాలకు చెందినవారా అని మాత్రమే అడుగుతోంది. అది ఓబీసీ, జనరల్ కేటగిరీలను స్పష్టంగా పేర్కొనలేదు అని అని విమర్శించారు. కుల గణనపై మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు కలుగుతున్నాయి. అందుకే కేంద్రం వెంటనే అన్ని రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, పౌర సమాజంతో చర్చలు జరపాలి అని ఆయన డిమాండ్ చేశారు.

---

# ఎన్సీపీ చీఫ్‌గా సునేత్ర పవార్..?



ముంబై : మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక శకం ముగిసింది. ఎన్సీపీ అధినేత, మహాయుతిలో భాగస్వామిగా ఉన్న డిప్యూటీ సీఎం అజిత్ పవార్ బారామతి విమాన ప్రమాదంలో మరణించారు. అయితే, ఇప్పుడు ఎన్సీపీకి పెద్ద దిక్కు ఎవరు కాబోతున్నారనే ప్రశ్న వినిపిస్తుంది. శరద్ పవార్‌తో విభేదాల తర్వాత, ఎన్సీపీలో చీలిక వచ్చింది. మెజారిటీ వర్గం ఎమ్మెల్యేలు, నేతలు అజిత్ పవార్‌తో ఉన్నారు. వీరంతా ఎన్డీయేలో భాగస్వాములయ్యారు.అయితే, ఇప్పుడు అజిత్ పవార్ మరణం తర్వాత ఎన్సీపీ అధినేతగా ఆయన భార్య సునేత్ర పవార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. రాజ్య సభ ఎంపీగా ఉన్న ఆమె వైపు అందరి చూపు మళ్లింది. సునేత్ర పవార్ ఎన్సీపీలో, మహారాష్ట్ర రాజకీయాల్లో పెద్ద నేతగా మారే అవకాశం ఉంది. మరాఠ్వాడా ప్రాంతంలోని ధారశివకు చెందిన ఆమె, రాజకీయంగా పలుకుబడి ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. మాజీ మంత్రి, లోక్‌సభ ఎంపీ అయిన పద్మ సింగ్ పాటిల్ సోదరి.1985లో అజిత్ పవార్‌ను వివాహం చేసుకున్న సునేత్ర, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బారామతి లోక్‌సభ స్థానం నుంచి శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలేపై పోటీ చేశారు. ఈ పోటీలో ఆమె 1.5 లక్షల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు.

**సునేత్ర పవార్ ఎవరు.? :** రైతు-రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన సునేత్ర, రాజకీయ నాయకురాలిగా, ఒక సామాజిక కార్యకర్త, పారిశ్రామిక, విద్యానిర్వాహకురాలిగా ఉన్నారు. అజిత్ పవార్ నీడ నుంచి బయటకు వచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం, బారామతి టెక్స్‌టైల్ కంపెనీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమె ఎన్విరాన్‌మెంటల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు కూడా, ఈ స్వచ్ఛంద సంస్థకు ఆమె 2010 నుండి నాయకత్వం వహిస్తున్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ గ్రామాలు మరియు పరిరక్షణ ప్రయత్నాలను ప్రోత్సహిస్తుంది. మహారాష్ట్రలో సుస్థిర అభివృద్ధికి ఆమె చేసిన కృషికి గాను ఆమెకు "గ్రీన్ వారియర్ అవార్డు" లభించింది.2011 నుంచి సునేత్ర ఫ్రాన్స్ లోని వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్‌లో థింక్ ట్యాంక్ సభ్యురాలిగా కూడా పనిచేస్తున్నారు. శరద్ పవార్ స్థాపించిన విద్యా ట్రస్ట్ అయిన విద్యా ప్రతిష్ఠాన్ ట్రస్టీగా కూడా ఉన్నారు. ఇది 25,000 మందికి పైగా విద్యార్థులకు విద్యను అందిస్తోంది. ఆమె 2017 నుంచి సావిత్రిబాయి పూలే పూణె విశ్వవిద్యాలయంలో సెనేట్ సభ్యురాలిగా కూడా ఉన్నారు.

**2024లో రాజకీయ ప్రవేశం:** ఎన్సీపీ అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలుగా చీలిపోయిన తర్వాత, తొలిసారిగా సునేత్ర ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. సొంత వదిన సుప్రియా సూలేపై బారామతి నుంచి బరిలో దిగారు. ఈ పోరులో సునేత్ర, సుప్రియా సూలే చేతిలో ఓడిపోయారు. దీని తర్వాత, కొన్ని రోజులకే ఆమె రాజ్యసభకు నామినేట్ అయ్యారు.

**అధినేతగా మారే అవకాశం:** ఎన్సీపీలో ప్రస్తుతం సునేత్ర పవార్‌కు మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీలో ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజబల్, దిలీప్ వాల్సే పాటిల్ వంటి ఇతర ప్రముఖులు ఉన్నప్పటికీ అజిత్ పవార్ భార్యగా ఆమెకు కలిసి వచ్చే అంశం. ప్రజల సానుభూతితో పాటు, అజిత్ పవార్ భార్యగా పార్టీని ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది. దశాబ్దాలుగా "పవార్" పాటిలిక్స్‌లో కొనసాగుతున్న పురుషాధిక్యతను ఈమె బద్దలుకొట్టే ఛాన్స్ ఉంది. సునేత్ర కుమారుడు పార్థ్ పవార్ నాయకత్వంపై దృష్టి పెట్టవచ్చు.

---



# వెలుతురు సమస్యతోనే అజిత్ పవార్ విమాన ప్రమాదం

- **ప్రమాదంపై స్పందించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు**

మహారాష్ట్ర విమాన ప్రమాదంపై పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం కూలిపోయినప్పుడు, బారామతి విమానాశ్రయంలో వెలుతురు సరిగ్గా లేదని అన్నారు. ఈ విమాన ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని చెప్పారు. ప్రమాదంపై దర్యాప్తు చేయడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) బృందాలు వచ్చాయి. విమానం ల్యాండ్ కావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో వెలుతురు తక్కువగా ఉందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. రన్వే కనిపించిందా అని పైలట్ను ఏటీసీ అడిగనపుడు, మొదట సరిగ్గా కనిపించడం లేదని చెప్పారు. రెండోసారి ల్యాండింగ్కు ప్రయత్నించినప్పుడు, రన్వే కనిపించిందా అని ఏటీసీ మళ్లీ అడిగింది. అప్పుడు పైలట్ సానుకూలంగా స్పందించారు. ఏటీసీ ల్యాండింగ్ క్లియరెన్స్ ఇచ్చిన తర్వాత విమానం కూలిపోయింది. మేము మరిన్ని వివరాలు అడిగాము. దర్యాప్తు పారదర్శకంగా నిర్వహిస్తాం.అని పౌర విమానయాన శాఖా మంత్రి - రామ్మోహన్ నాయుడు తెలిపారు

**శరద్ పవార్కు ప్రధాని మోదీ పరామర్శ :** బారామతి విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ (66) మృతి చెందడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్తో ఫోన్లో మాట్లాడిన ప్రధాని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎందుకంటే, శరద్ పవార్ సోదరుడి కుమారుడే అజిత్ పవార్.

అంతకు ముందు ఎక్స్ వేదికగా మోదీ ఓ పోస్టు పెట్టారు. అజిత్ పవార్ అట్టడుగు స్థాయి నుంచి ఎదిగిన ప్రజానాయకుడు. మహారాష్ట్ర ప్రజలకు సేవ చేయడంలో ఆయన చాలా కృషి చేశారు. అందుకే అతను అందరి నుంచి గౌరవాన్ని పొందారు. పరిపాలనా విషయాలపై ఆయనకున్న పట్టు, పేద, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన పడిన తపన ఎంతో గొప్పవి. ఆయన అకాల మరణం అత్యంత దిగ్భ్రాంతికరం, బాధాకరం. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి అని మోదీ పేర్కొన్నారు.

**బాధిత కుటుంబాలకు కూడా!** ఈ విషాధకర విమాన ప్రమాదంలో మరణించిన ఫ్లైట్ సిబ్బంది గురించి మోదీ మాట్లాడారు. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వ్యక్తులను కోల్పోయిన వారందరి గురించి నేను ఆలోచిస్తున్నాను. ఈ తీవ్ర దుఃఖ సమయంలో బాధిత కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్ని, శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను అని మోదీ అన్నారు.

**రాష్ట్రంలో సంతాప దినాలు :** మరోవైపు అజిత్ పవార్ మృతి పట్ల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మూడు రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించారు. బుధవారం ఉదయం చార్టర్డ్ ఫ్లైట్ కూలిపోయింది. దీనితో అందులో ఉన్న మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్తో సహా విమాన సిబ్బంది నలుగురు మరణించారు. అయితే ఈ ప్రమాద సమయంలో పైలట్ల నుంచి మేడే కాల్ రాలేదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ఘటన సమయంలో రన్వే గుర్తించడంలో పైలట్లు ఇబ్బంది పడినట్లు వివరించింది. తొలి ప్రయత్నంలో రన్వే కనిపించకపోవడంతో, గాల్లోనే కాసేపు చక్కర్లు కొట్టిందని, రెండో ప్రయత్నంలో లాండ్ అయ్యేందుకు ప్రయత్నించి విఫలమైనట్లు డీజీసీఏ పేర్కొంది. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఈ ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టనుంది. ప్రస్తుతం పవార్ అంత్యక్రియలకు హాజరు కావడానికి రామ్మోహన్ నాయుడు, పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ ఢిల్లీ నుంచి పుణెకు బయలుదేరారు.

---

# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ ఓగేమ్ ఛేంజర్

**ఐరోపా దేశాలతో ఒప్పందం నవశకానికి నాంది- స్టార్టప్‌లకు, సినిమాలకు, ఐటీకి మహర్దశ- 99 శాతం ఎగుమతులపై పన్నులు జీరో- యువతకు మరింత భరోసా ఎన్‌సీసీ ర్యాలీలో ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ : భారతదేశం, ఐరోపా సమాఖ్య మధ్య కుదిరిన చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా ప్రశంసలు అందుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది మన దేశ యువత భవిష్యత్తును మార్చేసే గేమ్ ఛేంజర్ అని స్పష్టం చేశారు. బుధవారం దిల్లీ కంటోన్మెంట్‌లో జరిగిన వార్షిక నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ప్రధాని ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అయితే, ఇదే వేదికపై నుంచి ఆయన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడం దేశానికి, ముఖ్యంగా మహారాష్ట్ర అభివృద్ధికి తీరని లోటని ఆయన కన్నీటి నివాళులర్పించారు.

**మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ యువతకు వరం :** నిన్ననే భారత్ ఒక చరిత్ర సృష్టించింది. ఐరోపా సమాఖ్యతో మనం కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రపంచం మొత్తం మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అని పిలుస్తోంది. ఇది కేవలం కాగితాలపై జరిగిన ఒప్పందం కాదు. ఇది మీ ఆశలకు, ఆశయాలకు స్వేచ్ఛను ఇచ్చే ఒప్పందం. మన యువతకు ఎల్లలు లేని అవకాశాలను ఇది కల్పిస్తుంది. 27 దేశాల సమాఖ్య అయిన ఈయూతో ఒప్పందం వల్ల, మన స్టార్టప్‌లకు నిధుల కొరత ఉండదు. వారికి అంతర్జాతీయ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అందుబాటులోకి వస్తుంది అని మోదీ వివరించారు.

**99 శాతం వస్తువులపై పన్ను లేదు** ఈ ఒప్పందం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను మోదీ గణాంకాలతో సహా వివరించారు. ఈ ఒప్పందం కింద, భారత్ నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం వస్తువులపై సుంకాలు ఉండవు. లేదా చాలా తక్కువగా ఉంటాయి. దీనివల్ల మన వస్తువులు ఐరోపా మార్కెట్లో చౌకగా లభిస్తాయి. తద్వారా మన ఎగుమతులు భారీగా పెరుగుతాయి. ఇది అంతిమంగా ఇక్కడ లక్షలాది కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది అని ఆయన పేర్కొన్నారు.ఈ ఒప్పందం కేవలం వస్తువులకే పరిమితం కాదని, సేవారంగానికి కూడా విస్తరించిందని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం మన క్రియేటివ్ ఎకానమీకి ఊపిరి పోస్తుంది. సినిమా, గేమింగ్, ఫ్యాషన్, డిజిటల్ కంటెంట్, సంగీతం, డిజైన్ వంటి రంగాల్లో ఉన్న యువతకు ఐరోపాలో ద్వారాలు తెరుచుకుంటాయి. పరిశోధన, విద్య, ఐటీ రంగాల నిపుణులకు లెక్కలేనన్ని అవకాశాలు వస్తాయి. ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో భారత్ అగ్రగామిగా నిలుస్తుంది అని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

---

**అణ్వాయుధాల తయారీపై**

# ఉత్తర కొరియా మరింత దూకుడు

**వర్కర్స్ పార్టీ ప్లీనరీలో కీలక ప్రకటన చేయనున్న కిమ్- తదుపరిదశ అణు కార్యక్రమాల ప్రణాళికను వెల్లడించే అవకాశం ఇప్పటికే భారీ రాకెట్ లాంచర్ వ్యవస్థల విన్యాసాలను పరిశీలించిన కిమ్**



న్యూఢిల్లీ అణ్వాయుధాల తయారీపై ఉత్తర కొరియా మరింత దూకుడు పెంచేందుకు సిద్ధమైంది. త్వరలో జరగబోయే వర్కర్స్ పార్టీ ప్లీనరీలో అణు కార్యక్రమాలను ఉద్ధృతం చేసే ప్రణాళికను ప్యాంగ్‌యాంగ్ అధినేత కిమ్ వెల్లడించనున్నారు. ఈ మేరకు ఉత్తర కొరియా అధికారిక మీడియా తెలిపింది. బహుళ బాలిస్టిక్ క్షిపణులను ఉత్తర కొరియా పరీక్షించినట్లు దక్షిణ కొరియా, జపాన్ ప్రకటన చేసిన మరుసటిరోజే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మంగళవారం కిమ్ సమక్షంలో బహుళ రాకెట్ లాంచర్ వ్యవస్థల విన్యాసాలు జరిగినట్లు ఉత్తర కొరియా అధికారిక మీడియా కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.దేశ అణు యుద్ధ నిరోధక శక్తిని మరింత బలోపేతం చేయడానికి తదుపరి దశ ప్రణాళికలను వెల్లడిస్తాం. ప్రస్తుతం చేపట్టిన ఈ పరీక్ష ఫలితం మనతో సైనిక ఘర్షణను రేకెత్తించడానికి ప్రయత్నించే శక్తులకు బాధాకరమైన మానసిక వేదన, తీవ్రమైన ముప్పును కలిగిస్తుంది. ఇది మా వ్యూహాత్మక నిరోధక ప్రభావాన్ని మెరుగుపరచడంలో చాలా ముఖ్యమైనది. అని కిమ్ అన్నారు. కిమ్తో పాటు ఆయన చిన్న కుమార్తె, ఉత్తర కొరియా సీనియర్ అధికారులు కలిసి ఈ ప్రయోగాన్ని వీక్షించారని తెలిపింది. ఈ బాలిస్టిక్ క్షిపణులను జపాన్ సముద్రం వైపు ప్రయోగించగా, ఇందులో రెండు క్షిపణులు దేశంలోని ప్రత్యేక ఆర్థిక మండలం వెలుపల ల్యాండ్ అయ్యాయి.

**పార్టీ సమావేశాల్లో తదుపరి దశ అణు కార్యక్రమాల వివరాలు :** భారీ రాకెట్ లాంచర్ వ్యవస్థల మొబిలిటీ, దాడుల కచ్చితత్వం మెరుగుపడినట్లు పేర్కొంది. మిలిటరీ సామర్థ్యాన్ని పెంచుకునే విషయంలో వర్కర్స్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని కిమ్ పేర్కొన్నట్లు కెఎన్ సిఏ వెల్లడించింది. తదుపరి దశ అణు కార్యక్రమాలను వర్కర్స్ పార్టీ సమావేశాల్లో కిమ్ వెల్లడించనున్నారని, ఇలాంటి ప్రకటన చేయటం ఐదేళ్లలో ఇదే మొదటిసారి అని పేర్కొంది.కాగా, ఇటీవలి కాలంలో ఉత్తం కొరియా తమ అణుశక్తి పరీక్షలను గణనీయంగా పెంచింది. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన ఆయుధ సంపత్తిని మరింత పెంచుకోవాలని ఎప్పటి నుంచో ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చే ఐదేళ్లలో మరిన్ని క్షిపణి వ్యవ స్థలను రూపొందించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం సంబంధిత అధికారులకు కిమ్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆయన గత కొంతకాలంగా తమ ఆయుధ కర్మాగారాలను వరుసగా సందర్శిస్తూ ఆయుధ సంపత్తి వివరాలను ఆరా తీస్తున్నారు. క్షిపణుల తయారీని మరింత వేగవంతం చేయాలని నిర్ణయించుకున్నట్లు ఉత్తరకొరియా మీడియా కథనం పేర్కొంది.

**కిమ్ వారసురాలు ఆమెనా? :** అంతకుముందు నెల రోజుల క్రితం అణు శక్తితో నడిచే జలాంతర్గామిని కిమ్ తన కుమార్తెతో కలిసి పరిశీలించారు. 8,700 టన్నుల బరు వుండే ఈ భారీ అణు జలాంతర్గామి బాహ్య నిర్మాణం దాదాపు పూర్తయినట్లు సమా చారం. మరోవైపు గత మూడేళ్ల నుంచి తండ్రి కిమ్‌జోంగ్ ఉన్‌తో పాటు జు-యే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటోంది. ఇటీవలె తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్‌సుసన్' స్మారకాన్ని ఆమె సందర్శించింది. కిమ్ తన కుమార్తెను అధికారిక పర్యటనలకు తీసుకువెళ్తుండడంతో భవిష్యత్తులో అధికారి క పగ్గాలు ఆమెకే అందించనున్నట్లు సంకేతాలను పంపుతున్నారని దక్షిణ కొరియా నిఘా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కాగా దక్షిణ కొరియా నిఘా వర్గాల ప్రకారం కిమ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో సంతానంగా పుట్టిన కుమార్తె కిమ్-జు-యే అధికారాన్ని చేపట్టే అవకాశం ఉందని స్థానిక అధికారిక వర్గాలు భావిస్తున్నాయి. వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చిన కిమ్, తన తండ్రి కిమ్ జోంగ్-2 2011లో మరణానంతరం పగ్గాలు చేపట్టారు.

---

# వాచ్ ఆధారంగా అజిత్ మృతదేహం గుర్తింపు



పుణె: మహారాష్ట్రలోని బారామతి విమానాశ్రయం సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విమానం క్రాష్ అయిన వెంటనే ముక్కలై పెద్దత్తున మంటలు చెలరేగాయి. దీంతో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, మరో నలుగురు అక్కడికక్కడే మరణించారు. వారి మృతదేహాలు ఛిద్రమై గుర్తుపట్టలేనంతగా మారాయి. ఘటనా స్థలంలో లభ్యమైన శరీర భాగాలను గుర్తించడం అధికారులకు సవాలుగా మారింది. అయితే అజిత్ పవార్ చేతికున్న వాచ్ ఆధారంగా ఆయన మృతదేహాన్ని గుర్తించి బయటకు లాగారు. అయితే అప్పటికే నష్టం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. అజిత్ పార్టీ ఎన్సీపీ అధికారిక గుర్తు కూడా క్లాక్ (గడియారం) కావడం యాదృచ్ఛికం.

**నేడు అంత్యక్రియలు :** అజిత్ పవార్ తన రాజకీయ జీవితంలో 8 సార్లు బారామతి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఇప్పుడు అదే ప్రాంతంలో కన్నుమూయడం నియోజకవర్గ ప్రజలను శోకసంద్రంలో ముంచింది. ఆయన మృతికి నివాళిగా మహారాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. బారామతిలోనే అజిత్ పవార్ అంత్యక్రియలు గురువారంనాడు జరుగనున్నాయి.




## ఏసీబీకి చిక్కిన నార్నూర్ ఏఈ శ్రీకాంత్ డిస్మిస్

● అవినీతికి పాల్పడితే కటకటాలే...బ్లాక్ లిస్టులో వివరాలు
● హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి, లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల అవుట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గం శ్రీకాంత్ ను ఉద్యోగంలో నుంచి తొలగించామని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ విపి.గౌతం తెలిపారు. ఇతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, భవిష్యత్తులో ఎక్కడా ఉద్యోగం రాకుండా వివరాలను బ్లాక్ లిస్టులో పెడుతున్నట్లు ప్రకటించారు. శ్రీకాంత్ గత ఏడాది మే నెల నుంచి విధులను నిర్వహిస్తూ మంగళవారం నాడు నార్నూర్ లో ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి లంచం డిమాండ్ చేసి, రెడ్ హ్యాండెడ్ గా దొరికారు.బిల్లుల విడుదల నిమిత్తం ఇండ్ల ఫోటోలు అప్ లోడ్ చేయడానికి అధికారులెవరైనా నిరాకరిస్తే, ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా లబ్ధిదారులే స్వయంగా పోటోలను అప్ లోడ్ చేసుకోవచ్చని ఎండి సూచించారు.

**అవినీతిని ఉపేక్షించేది లేదు...**

పేదలకు శాశ్వతమైన లబ్ధి చేకూర్చే బృహత్తరమైన సంక్షేమ కార్యక్రమంలో అవినీతికి పాల్పడుతూ, లంచాలను డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎండి గౌతం స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో ఇరుక్కున్న వారు జైలుకు వెళ్లడమే కాకుండా, తదుపరి వారికి ఎక్కడా ఉద్యోగాలు లభించవని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో వివిధ రకాల విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ సిబ్బంది అయినా, డిప్యూటేషన్ పై వచ్చిన వారైనా, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అయినా ,అవినీతికి పాల్బడితే కేసులు ఎదుర్కోవాల్సిందే అని హెచ్చరించారు. ఈ అంశంలో ప్రజలకు ఏమైనా ఫిర్యాదులుంటే 1800 599 5991 కాల్ సెంటర్ కు ఫోన్ చేయాలని కోరారు.

## 94,689 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ

ఫిబ్రవరి 3న తెనాలిలో మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్‌చే ప్రారంభం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 94,689 మంది విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానుంది. గుంటూరు జిల్లా తెనాలిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదగా రాష్ట్ర వ్యాప్త ప్రారంభ కార్యక్రమం లాంఛనంగా జరగబోతుంది. దీనికి అనుగుణంగా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సదరు ప్రాంతాల విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ జరగనుంది. ఎంపికచేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఆరేళ్ల నుంచి 18 ఏళ్లలోపు చదివే విద్యార్థులకు కిందటేడాది జులై నుంచి నవంబరు వరకు పారా మెడికల్ అసిస్టెంట్సు ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 94,689 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. ఇందుకు అనుగుణంగా కంటి అద్దాలు సిద్ధమయ్యాయి. ఇందుకు సుమారు రూ. 2.52 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేస్తోంది.

# అదే మోసం.. ఇంకెంత కాలం

● మున్సిపల్ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయరా ● బీసీలకు గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వం ● గతంలో 34 శాతం అమలు చేసి ఇప్పుడు 28 శాతంకు తగ్గిస్తారా! ● ఇది మోసం - దగా కాదా! ● శాంతియుతంగా ఉద్యమాలు చేస్తే స్పందించరా! దాడులు చేయాలా! ● జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బీసీలను ఇంకెంత కాలం మోసం చేస్తారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రస్తుతం ప్రకటించిన మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు కేవలం 28.5% తగ్గించి బీసీలకు దగా చేశారు. మోసం చేశారు. బుధవారం 15 బి.సి సంఘాలు జాతీయ బి.సి సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి నీల వెంకటేష్, పగిళ్ళ సతీష్ సమన్వయం చేసారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానం ప్రకారం మరియు రాహుల్ గాంధీ వాగ్దానం ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. పంచాయతీరాజ్ లో అమలు చేయలేదు. చివరికి మునిసిపాలిటీలలో కూడా అమలు చేయకుండా బీసీలకు దగా చేశారు - మోసం చేశారు. గత ఎన్నికలలో 34 శాతం మున్సిపాలిటీలలో అమలు చేశారు. ఇప్పుడు దానిని 28 శాతం తగ్గించడం ఏమాత్రం లాజిక్ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా బీసీలను రాజకీయంగా అణచివేయాలని కుట్రతో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయకుండా తొక్కి పెడుతున్నారు. ఒకవైపు కోర్టు కేసు నడుస్తుంది. తీర్పు రాకుండానే ఎన్నికలు జరపడం న్యాయవిరుద్ధం - రాజ్యాంగ విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల వాగ్దానం ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నాం. ఒకవైపు కోర్టులో కేసు నడుస్తుంది. ఇంకొక వైపు ప్రజా ఉద్యమాలు నడుస్తున్నాయి. పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తుంటే కూడా ముఖ్యమంత్రి స్పందించడం లేదు. 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అనేక ఉద్యమాలు చేపట్టాం.. 12సార్లు రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు జరిపాం. ఒకసారి బంద్ జరిపాం. చారిత్రాత్మకమైన బంద్ జరిగింది. ఆరుసార్లు 130 ల బీసీ కుల సంఘాల సమావేశం జరిపాం. 18 సార్లు ప్రదర్శనలు ర్యాలీలు కలెక్టరేట్లు ముట్టడి చేశాం. ప్రతి జిల్లాలలో నాలుగు సార్లు కుల సంఘాల సమావేశం జరిపారు. 10 సార్లు రౌండ్ టేబుల్ సమావేశాలు, ఒకసారి వేలాదిమంది సత్యగ్రహ దీక్ష జరిపారు.

రెండుసార్లు ధర్మ దీక్ష జరిపాం. జిల్లాలలో అనేక నిరసన ప్రదర్శనలు - దీక్షలు జరిపారు. కానీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద యెత్తున ఉద్యమాలు చేస్తుంటే భయం లేకపోతే ఎలా! శాంతియుతంగా ఉద్యమాలు చేస్తుంటే స్పందించకపోతే దాడులు చేయాలా!యని ప్రశ్నించారు.కోర్టులో కేసు నడుస్తుండగా తీర్పు రాకుండా మున్సిపల్ ఎన్నికలకు ఎలా వెళ్తారు.స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేసు హైకోర్టులో నడుస్తుంది. దీనిపై "స్టే" ఉంది. పంచాయతీ ఎన్నికలు జరిపే సమయంలో ఎన్నికలు జరగకపోతే కేంద్రం నుంచి వచ్చే 3000 కోట్లు గ్రాంట్ రాదని అందుకు ఎన్నికలు జరపాలని జరిపారు. ఇప్పుడు సిగ్గు లేకుండా ప్రకటించారు.కోర్టులో కేసు నడుస్తుంది. ఎందుకు మున్సిపల్ - ఎంపీటీసీ - జడ్పిటిసి ఎన్నికలకు తొందర.కోర్టు కేసు న్యాయపరంగా, చట్టపరంగా, రాజ్యాంగపరంగా బలంగా ఉంది. ఎన్ని కోణాల్లో చూసిన కేసు గెలుస్తుంది. గెలిపించడానికి సర్వశక్తులు పోరాడుతున్నాం. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వం కేసు గెలిపించడానికి గట్టిగా ప్రయత్నం చేయకుండా ఎన్నికలకు తొందరపడడం దేనికి? కోర్టులో బీసీల కేసు అంటే ఓడిపోతుంది. కొట్టివేస్తారు. అనేది ఒక ఫ్యాషన్ గా తయారయింది. ఇప్పుడు ఈసారి ఈ కేసు ఎలా ఓడుతుందో చూస్తాం ఎందుకంటే బి.సి ఉద్యమం బలంగా యుంది. కేసు ఆదారాలు బలంగా యున్నవి.కేసు బలంగా ఉంది. ఇంకొక వైపు ప్రజా బీసీ ఉద్యమం బలంగా ఉంది. రిజర్వేషన్ల కేసు సందర్భంగా బీసీ బంద్ జరిపినప్పుడు దాని తీవ్రత చూశారు. కేసు బెంచ్ మీదకు రాకుండా వాదించకుండా ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుంది. బీసీల జీవితాలతో బీసీ ఆత్మగౌరవంతో చెలగాటం ఆడుతుంది. ప్రభుత్వం ఈ వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు జరుగుతాయని హెచ్చరిస్తున్నాం.ఒకసారి వేలాదిమంది సత్యగ్రహ దీక్ష జరిపారు. రెండుసార్లు ధర్మ దీక్ష జరిపాం. జిల్లాలలో అనేక నిరసన ప్రదర్శనలు - దీక్షలు జరిపారు. ప్రజలందరూ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణా ఉద్యమం వలే బి.సి ఉద్యమం విస్తరించింది. మంచితనాన వినడం లేదు. కానీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. ఇక రాజకీయ నాయకులనే టార్గెట్ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల శాంతియుతంగా పద్ధతిలో, ప్రజా స్వామ్యబద్దంగా, రాజ్యాంగ బద్ధమైన పరిస్థితులలో ఉద్యమాన్ని నడిపితే ప్రభుత్వం స్పందించడం లేదు. ఇలాంటి పరిస్థితులలో ఉద్యమం స్వభావం మారుస్తామని హెచ్చరిస్తున్నాం. ఉద్యమపంద మారుస్తామని హెచ్చరించారు.ఈ సమావేశానికి ర్యాగ అరుణ్ కుమార్, నీలం వెంకటేష్, గుజ్జ సత్యం, పగిళ్ళ సతీష్, అనంతయ్య, రాజేందర్, మోదీ రాందేవ్, రాజు నేత, అనురాధ గౌడ్, శివ కుమార్ యాదవ్, అంజి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## భూ రీసర్వే ప్రక్రియను గతంలో టిడిపి ఆరంభించింది

● 2018లోనే జీఓ నంబర్ 1348 జారీ చేసింది ● సాంకేతికతతో పైలట్ ప్రాజెక్ట్‌గా ఆరంభించిన ఘనత మాదే ● అసలు ఆస్తి పత్రాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే ప్రమాదకర యోచన వైసిపీది ● అందుకే చట్టం ద్వారా ప్రజలు సివిల్ కోర్టులకు వెళ్లే హక్కును తీసేసింది ● గత ప్రభుత్వ రీసర్వే గందరగోళం వల్ల 7.80 లక్షల భూ ఫిర్యాదులు వచ్చాయి ● కూటమి - ప్రభుత్వం వాటిని పరిష్కరిస్తూ పట్టాలు ఇస్తోంది ● ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఘాటు వ్యాఖ్యలు

ఏపీ స్టేట్ బ్యూరో సూర్య ప్రధాన ప్రతినిధి : సర్వే రాళ్లపై జగన్ బొమ్మ వేయించేందుకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి, సుమారు రూ.700 కోట్లను వైకాపా ప్రభుత్వం దోచుకుందని ఎమ్మెల్యే మాధవీరెడ్డి గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పార్టీ నాయకులు 'క్రెడిట్ చోరీ' అంటూ పెద్ద ఎత్తున గగ్గోలు పెడుతున్నారు. డబ్బులు పెట్టుకుని మాట్లాడించే పేటీఎం బ్యాచ్‌ను ముందు పెట్టుకుని ప్రజలను తప్పుదారి పట్టించాలనే ప్రయత్నం చేస్తున్నారు. కానీ అసలు నిజం ఏంటంటే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తుండటమే వీళ్ల భయానికి కారణం. ఒక ఆయుధం పిచ్చోడు చేతిలో ఉంటే ఎలా నాశనం చేస్తుందో, అదే ఆయుధం మంచి వ్యక్తి చేతిలో ఉంటే ఎలా ప్రజలకు ఉపయోగపడుతుందో.. ఈరోజు పట్టాదారు పాస్ పుస్తకాలు దానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.జగన్మోహన్ రెడ్డి భూ రీసర్వే పేరుతో గత ఐదేళ్లలో చేసిన దోపిడీలు, ఆక్రమణలు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. అందుకే పట్టాదారు పాస్ పుస్తకాలు చేతికి వస్తే తమ దుర్మార్గాలు మళ్లీ గుర్తొస్తాయేమో అన్న భయంతో, వీళ్లంతా బయటకు వచ్చి 'క్రెడిట్ చోరీ' అంటూ మాట్లాడుతున్నారు. కానీ వాస్తవం ఏమిటంటే, 2018లోనే తెలుగుదేశం ప్రభుత్వం మంచి ఉద్దేశంతో, రైతుల భూములకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో భూ రీసర్వే ప్రక్రియను ప్రారంభించింది.తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే జగ్గయ్యపేట నియోజకవర్గంలోని తక్కెల్లపాడులో పైలట్ ప్రోగ్రామ్‌గా భూ రీసర్వే మొదలుపెట్టింది. కంటిన్యూస్ ఆపరేటింగ్ రెఫరెన్స్ స్టేషన్స్ ద్వారా సాంకేతికంగా రీసర్వే చేయాలనే ఉద్దేశంతో 2018 సెప్టెంబర్ 25న జీఓ నెంబర్ 1348ను కూడా జారీ చేసింది. అయితే 2019లో దురదృష్టవశాత్తు టీడీపీ ఓడిపోవడంతో, వైకాపా పార్టీ అధికారంలోకి వచ్చి ఈ భూ రీసర్వేను ప్రజల భూములు దోచుకునే ఆయుధంగా మార్చింది. వైకాపా ప్రభుత్వం రీసర్వే పేరుతో భూవివాదాలు సృష్టించి, ప్రజలను కోర్టుల చుట్టూ తిరగలేని పరిస్థితి తీసుకొచ్చింది. వేలాది భూములను 22- జాబితాలో చేర్చి, సమస్యలు పరిష్కరించకుండా ప్రజలను అల్లకల్లోలం చేసింది. ఆ తర్వాత 'క్లియర్ టైటిల్స్ ఇస్తాం' అని మోసం చేస్తూ 2023 అక్టోబర్ 31న ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా ప్రజల స్వేచ్ఛను హరించి, ఆస్తులను లాక్కోవాలనే దురుద్దేశమే స్పష్టంగా కనిపించింది.నీతి ఆయోగ్ సూచనల ప్రకారం నిపుణులు, న్యాయ అధికారులు ఉండాల్సిన అపిలేట్ ట్రిబ్యునల్‌లో 'ఎనీ పర్సన్' అనే పదాన్ని చేర్చి, వైసీపీ తన కార్యకర్తలనే నియమించుకునేలా వ్యవస్థను వక్రీకరించింది. స్థానిక కోర్టులకు వెళ్లే అవకాశం లేకుండా చేసి, నేరుగా హైకోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి తెచ్చింది. రెవెన్యూ వ్యవస్థ మొత్తాన్ని రిజిస్ట్రేషన్ అధికారుల చేతుల్లో పెట్టి, ప్రజల ఆస్తులను గుప్పెట్లో పెట్టుకోవాలనే పెద్ద కుట్ర ఇది. రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత అసలు డాక్యుమెంట్లు ఇవ్వకుండా, డూప్లికేట్ కాపీలు ఇస్తామని, అసలు పత్రాలు ప్రైవేట్ కంపెనీల వద్ద ఉంచుతామని చట్టంలో చేర్చడం అత్యంత ప్రమాదకరం. తరతరాలుగా ప్రజల దగ్గరే ఉన్న ఆస్తి పత్రాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలనుకోవడం వైసీపీ దురుద్దేశానికి నిదర్శనం. ఈ కుట్రను ప్రజలు గుర్తించారు కాబట్టే 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఇచ్చారు.వైకాపా ప్రభుత్వం సర్వే రాళ్ల పేరుతో ఒక నాయకుడి బొమ్మను పాతి, దానికి 700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. మా భూముల్లో దిష్టి బొమ్మలు పెట్టుకోవాలంటే మేమే పెట్టుకుంటాం, ప్రభుత్వ ఖర్చుతో నాయకుల బొమ్మలు ఎందుకు అన్న ప్రశ్నకు వైకాపా వద్ద సమాధానం లేదు. అలాగే పట్టాదారు పాస్ పుస్తకాలపై బొమ్మల కోసం మరో 20 కోట్లు వృథా చేశారు. కానీ రాజముద్రతో వచ్చిన కొత్త పాస్ పుస్తకాలు చూసి ప్రజలు నిజమైన మార్పు ఏంటో గుర్తించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసింది. ఆ నిర్ణయంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తర్వాత పూర్తిగా పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా భూ రీసర్వేను మళ్లీ ప్రారంభించింది. ప్రతి నియోజకవర్గం, మండలం, పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టింది. దాదాపు 7 లక్షల 78 వేల ఫిర్యాదులను స్వీకరించి, ఒక సంవత్సరం లోపే పరిష్కరించడం గత పాలనలో జరిగిన భయాందోళనలకు ప్రత్యక్ష సాక్ష్యం.గ్రామ సభల్లో ఆస్తి వివరాలు నిర్ధారించిన తర్వాతే కేవైసీ పూర్తి చేసి, భారతదేశ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. ప్రజలు గర్వంగా తమ పాస్ పుస్తకాలు చేతబట్టి, "మా ఇంట్లోని దరిద్రమైన ఫోటో పోయింది" అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే నిజమైన ప్రజాపాలనకు గుర్తు.వైసీపీ క్రెడిట్ చోరీ అంటోంది. కానీ 2018లో జారీ చేసిన జీఓలు, పైలట్ ప్రాజెక్టులు అన్నీ భూ రీసర్వే క్రెడిట్ పూర్తిగా తెలుగుదేశం పార్టీకేనని స్పష్టం చేస్తున్నాయి. మీరు కొనసాగించింది కేవలం టీడీపీ మొదలుపెట్టిన ప్రక్రియనే. పేటీఎం బ్యాచ్‌తో ఎంత డ్రామా చేసినా, ప్రజలు నిజాన్ని గుర్తించారు కాబట్టే 2024లో 164 సీట్లతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. భూవివాదాలు సృష్టించిన క్రెడిట్, రెవెన్యూ వ్యవస్థను నాశనం చేసిన క్రెడిట్, ప్రజలను భయాందోళనకు గురి చేసిన క్రెడిట్ అంతా వైసీపీకే. ఆ క్రెడిట్‌ను మేము దోచుకోవాల్సిన అవసరం లేదు. తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ప్రజల ఆస్తుల రక్షణ, యువత భవిష్యత్, అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తుంది. రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ముందంజలో నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు అడుగులు వేస్తున్నారు.ఆ ప్రయాణంలో కార్యకర్తలంతా సైనికుల్లా నిలబడతామని మాధవి గారు స్పష్టం చేశారు.

# వైసీపీ నేతల అక్రమాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ

● సీసీ రోడ్డు నిర్మాణానికి అడ్డుపడిన వైసీపీ నేతలు.. ఇనుప రాడ్లతో దాడి ● డిప్యూటీ ఎంపీడీవో మద్దతుతో వైసీపీ మహిళా సెక్రటరీ వేధింపులు.. చర్యలు తీసుకోవాలంటూ వినతి ● వైసీపీ నేత వై.యస్. రవీంద్ర రెడ్డి అనుచరుల భూమి ఆక్రమణ..న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి ● అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు ● ఎమ్మెల్సీ బీటీ నాయుడు , మాజీ ఎమ్మెల్సీ, సెంట్రల్ ఆఫీస్ సెక్రటరీ పరుచూరి అశోక్ బాబు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పల్నాడు జిల్లా, బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం తండా గ్రామానికి చెందిన జయరాంనాయక్ నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. గరికపాడు గ్రామ డి.నెం. 748-1లో య.0-05 సెంట్ల ఖాళీ స్థలంను ప్రభుత్వం వారు డి.కె.నెం. 137/హెచ్.బి/1996 ప్రకారం బాణావతు చిన్న బాలు నాయక్‌కు మంజూరు చేయగా ఆయన వద్ద నుంచి తాను 01-06-2010 తేదీన స్థిరాస్థి విక్రయ స్వాధీన అగ్రిమెంట్ ద్వారా చట్టబద్ధంగా పొందాను. అయితే 2021 నుంచి వైసీపీ నాయకులు మూడావతు హనుమానాయక్, ఆయన కుటుంబ సభ్యులు అధికార బలాన్ని దుర్వినియోగం చేస్తూ వారి స్థలం ప్రక్కన పెట్టి తమ స్థలంలో అక్రమంగా రేకుల షెడ్ నిర్మించి, తమపై పలుమార్లు తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు. ఈ విషయమై ఎంఆర్వో, ఆర్డీఓ, కలెక్టర్ తదితర అధికారులకు అనేక అర్జీలు ఇచ్చినా ఇప్పటివరకు న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని నేతలు ఎమ్మెల్సీ బీటీ నాయుడు , మాజీ ఎమ్మెల్సీ, సెంట్రల్ ఆఫీస్ సెక్రటరీ పర్చూరి అశోక్ బాబులకు అర్జీ ఇచ్చి అభ్యర్థించాడు.ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం నరసింహాపురం గ్రామానికి చెందిన సురేష్ గ్రీవెనస్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సీసీ రోడ్డును వేయడానికి ప్రయత్నించగా గ్రామానికి చెందిన వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్రమంగా అడ్డుకుంటున్నారు. గ్రామానికి చెందిన మలిరెడ్డి నరసింహా రెడ్డి, మలిరెడ్డి నరసింహం, మలిరెడ్డి వెంకట రెడ్డి, మలిరెడ్డి వీరరఘువులు, మలిరెడ్డి పెదరాగయ్య తదితరులు కలిసి 17-01-2026 శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మారణాయుధాలతో వచ్చి ఈ రోడ్డు వేయొద్దు, ఈ స్థలం మాదే అంటూ తమపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. దాడిని అడ్డుకునేందుకు వచ్చిన తమ బంధువులపై కూడా దాడి చేశారు. వీరిపై గతంలో హత్యాయత్నం కేసులు ఉన్నప్పటికీ, పోలీసు శాఖ నుంచి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.పోలవరం జిల్లా వై. రామవరం గ్రామానికి చెందిన గణేష్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తాము గిరిజనులు, గిరిజనేతరులు కలిసి ఎటువంటి విభేదాలు లేకుండా గత 70 సంవత్సరాలుగా ఐక్యంగా జీవిస్తున్నాము. తమ జీవనోపాధి కోసం తమ నివాస గృహాల ముందు చిరువ్యాపారాలు చేస్తూ కొందరు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాము. అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడాన్ని ఓర్వలేక, స్థానికంగా వైసీపీ మహిళా సెక్రటరీ లండా శారదాదేవి తమ మీద కక్ష సాధింపుగా టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. ఆమెకు డిప్యూటీ ఎంపీడీవో ఆర్.ఎస్.ఎస్. రాజు మద్దతుగా ఉండి, వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ టీడీపీకి చెందిన తమని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.కడపకు చెందిన పి. షావలిఖాన్, పి. మస్తాన్ ఖాన్ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. పొలంపల్లి గ్రామంలో ఉన్న సర్వే నెం. 706, 779లలో మొత్తం విస్తీర్ణం 4.70 సెంట్లు భూమి తమ పూర్వదాయాదుల ఆస్తి. ఈ భూమి తమ తాతగారి నుండి వారసత్వంగా తమకు సంక్రమించిన చట్టబద్ధమైన ఆస్తి. అయితే గత ప్రభుత్వ హయాంలో వై.యస్. రవీంద్ర రెడ్డి అనుచరులైన వెంకటప్ప, వెంకటకృష్ణలతో కలిసి ఈ భూమిని తమదని చెబుతూ తప్పుడు రికార్డులు సృష్టించి, తమని తీవ్రంగా భయభ్రాంతులకు గురి చేశారు. ఈ స్థలానికి సంబంధించిన ఒక్క అసలైన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, పూర్వీకుల ఆర్.హెచ్., డైక్లాట్ వంటి చట్టబద్ధ పత్రాలు వారికి లేనప్పటికీ తమ స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఇంకా ఈ స్థలం వద్దకు వస్తే "చంపేస్తాం" అంటూ ప్రాణహానీ బెదిరింపులు చేసి గత ప్రభుత్వ కాలంలో 45 సంవత్సరాల పాటు మమ్మల్ని నరకయాతనకు గురి చేసి తమ స్థలాన్ని అనుభవించకుండా చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం మాల్యావంతం గ్రామానికి చెందిన జీ. లింగారెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 266లో మొత్తం 7.04 ఎకరాలు భూమి కలదు. ఇందులో 4 ఎకరాలు 50 సెంట్లు భూమి తమ కుటుంబానికి చెందిన ఒరిజినల్ దస్తావేజులు ప్రకారం చట్టబద్ధంగా నమోదు అయి ఉండాలి. కానీ ప్రస్తుతం ఆన్‌లైన్ నంబర్, భూమి ప్రొసీడింగ్స్ లో తమ భూమి విస్తీర్ణం వాస్తవానికి ఉన్నదానికంటే తక్కువగా నమోదు చేసి చూపిస్తున్నారు. ఈ తప్పు నమోదు కారణంగా తమ భూమికి వెళ్లే దారిని పూర్తిగా అక్రమంగా ఆక్రమించి మూసివేశారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.ఏలూరుకు చెందిన రాజకుమారి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..గుడివాడ టౌన్ పరిధిలోని సర్వే నెం. 622/2లో ఉన్న 9 సెంట్ల స్థలాన్ని యార్లగడ్డ నాగమల్లేశ్వరరావు గారి వద్ద నుంచి చట్టబద్ధంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇప్పటివరకు అనుభవిస్తున్నాను. కాలక్రమేణా సదరు స్థలమునకు చుట్టుప్రక్కల పిచ్చి మొక్కలు పెరిగి, గతంలో నిర్ణయించిన భూమి హద్దులు తొలగిపోవడంతో, మున్సిపల్ సర్వేయర్ ద్వారా భూమిని కొలిపించి హద్దులు నిర్ధారించుకునే ప్రయత్నం చేశాను. అయితే హైదరాబాద్‌లో గా ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న యార్లగడ్డ రాంబాబు, సర్వే జరగకుండా అడ్డుకోవడంతో పాటు, సర్వే అధికారులను కేసులు పెడతానని బెదిరిస్తూ, మూడు సార్లు ప్రయత్నించినప్పటికీ సర్వే జరగకుండా చేస్తున్నాడు. తన తండ్రి విక్రయించిన స్థలాన్ని అప్పగించకుండా ఆ స్థలాన్ని ఆక్రమించుకునే ఉద్దేశ్యంతో తమను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాడు. కావునా వారిపై చర్యలు తీసుకోన తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.విశాఖపట్నం గాజువాకకు చెందిన రమణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అసిస్టెంట్‌సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా సేవలందించి రిటైర్ అయిన తను గాజువాకలో జీవనం సాగిస్తున్నాను. తమ పక్క ఫ్లాట్‌లో నివసించే పేకేటి వెంకట రమణ పరిచయంతో ఆయన సహచరులైన కె. సత్యనారాయణ, తోట శ్రీనివాసరావులతో స్నేహం ఏర్పడింది. మధురవాడలో ఉన్న భూమికి ప్రభుత్వ అనుమతుల కోసం డబ్బు అవసరమని చెప్పి, వారు తనను నమ్మించి రూ.20 లక్షల సహాయం కోరారు. తన వద్ద నగదు లేనందున తన భార్య పేరున నర్సీపట్నం మండలం పెద బొడ్డేపల్లి, సర్వే నెం. 43/3లోని 7.04 సెంట్ల ఇంటి స్థలం డాక్యుమెంటును నమ్మకంతో వారి వద్ద ఇచ్చాను. రెండుమూడు నెలల్లో మధురవాడలో స్థలం గాని లేదా డబ్బు గాని ఇస్తామని చెప్పి, 2023 సంవత్సరంలో తన భార్య పేరున రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. అయితే ఆరు నెలలు గడిచినా స్థలం గాని, డబ్బు గాని ఇవ్వకపోగా గత ఆరు నెలలుగా ఫోన్లు కూడా ఎత్తడం లేదు. నర్సీపట్నం పోలీసుల సహాయంతో పిలిపించినా వారు తప్పించుకుంటూ తిరుగుతున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.పోలవరం జిల్లా గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన మట్టం రాజులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమకు సర్వే నెం. 3/1లో 0.05 సెంట్ల స్థలం చట్టబద్ధంగా కలదు. అయితే కొక్కెల రఘు అనే వ్యక్తి మమ్మల్ని పదే పదే బెదిరిస్తూ తమ ఇంటి స్థలాన్ని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ ఇప్పటివరకు సరైన పరిష్కారం లభించలేదు. అయినప్పటికీ వారు తమ మీద బెదిరింపులు కొనసాగిస్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కె. కొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం. 142-లో 3.50 ఎకరాల వ్యవసాయ సాగుభూమి చట్టబద్ధంగా కలదు. ఈ భూమికి రాకపోకల కోసం దారి ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేయగా, ఎర్రసామి, చిన్ని ఎర్రసామి, రాము అనే వ్యక్తులు అడ్డుపడి, దారి ఏర్పాటు చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ అక్రమ అడ్డంకుల వల్ల తమ సాగుభూమిని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇది తమ జీవనాధారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల గంటాపురం గ్రామానికి చెందిన అప్పస్వామి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు 2 ఎకరాల భూమి కలదు. గ్రామానికి సర్పంచ్ అయిన తమ కోడలు భూ లక్ష్మి రెవెన్యూ వాళ్లతో కలిసి దౌర్జన్యంగా తమ పేరుపై పట్టా పాసు పుస్తకాలను మార్పుకునేందుకు యత్నిస్తున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమిని కాపాడాలని కోరాడు.శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం గుడ్డదొన గ్రామానికి చెందిన శ్రీదేవి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో పరిధిలోని సర్వే నెం. 103/2, 104/2లలో ఉన్న భూమి ప్రభుత్వ భూమి అయినప్పటికీ, అప్పటి తహశీల్దారు, కలిగిరి వారు చట్టవిరుద్ధంగా వెబ్ ల్యాండ్‌లో పట్టా భూమిగా నమోదు చేసి, అనర్హుల పేర్లపై 1-బి అడంగల్‌లు జారీ చేశారు. ఈ అక్రమ చర్యలపై విచారణ చేపట్టిన గౌరవ జాయింట్ కలెక్టర్, నెల్లూరు వారు ఈ భూములు ప్రభుత్వ భూములేనని నిర్ధారించి, వాటిని వెబ్ ల్యాండ్‌లో ప్రభుత్వ భూమిగా నమోదు చేసి స్వాధీనపరుచుకోవాలని తహశీల్దారు, కలిగిరి వారికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఉత్తర్వులు జారీ అయి రెండేళ్లు గడిచినా తహశీల్దారు కలిగిరి వారు ఇప్పటివరకు అమలు చేయలేదు. ఈ భూమి ఇప్పటికీ వెబ్ ల్యాండ్‌లో పట్టా భూమిగానే నమోదై ఉంది. కోటా వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఫేక్ డాక్యుమెంట్లు, ఫేక్ పాసుపుస్తకాలు సృష్టించి అధికారులను తప్పుదారి పట్టించి ఈ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. ఇదే కాకుండా ఈ భూమికి సమీపంలో తమకు చట్టబద్ధంగా ఉన్న య.12.62 సెంట్ల పట్టా భూమి విషయంలో కూడా మమ్మల్ని పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.పోలవరం జిల్లా వి.ఆర్.పురం మండలం రేఖపల్లి రెవిన్యూ గ్రామానికి చెందిన లక్ష్మణరావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో పట్టా నెం. 10/3లో ఉన్న ఎ.5.56 సెంట్ల వ్యవసాయ భూమి వంశపారంపర్యంగా సంక్రమించిన చట్టబద్ధమైన ఆస్తి. అయితే ఈ భూమిని వెబ్ ల్యాండ్‌లో తమ అనుమతి లేకుండా, చట్టవిరుద్ధంగా వేరొకరి పేరు మీద నమోదు చేయడం జరిగింది. ఈ తప్పుడు ఎంట్రీల కారణంగా తమ తీవ్ర అన్యాయం జరిగింది. ఇటువంటి అక్రమ మార్పులకు పాల్పడిన మండల రెవిన్యూ శాఖ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించి భూమిని మళ్లీ తమ పేరు మీద వెబ్ ల్యాండ్‌లో సరిచేసి నమోదు చేయాలని కోరాడు.వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.



# ప్రమాదాలు తెస్తున్న విషాదాలు

## ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన ప్రముఖులు

**భారతదేశ చరిత్రలో చోటుచేసుకున్న పలు విమాన, హెలికాప్టర్ , రోడ్డు ప్రమాదాలు దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. ఈ దుర్ఘటనల్లో రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, సినీ ప్రముఖులు సహా అనేకమంది ప్రముఖులు తమ ప్రాణాలను కోల్పోయారు. తాజాగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తోపాటు మరో ఐదుగురు మృతి చెందారు. ఈ నేపథ్యంలో, ఇప్పటివరకు విమాన ప్రమాదాల్లో మరణించిన ప్రముఖులపై ఒకసారి చూద్దాం.**

### అజిత్ పవార్



విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలింది . ఈ దుర్ఘటనలో పవార్ (66)తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబయి నుంచి బారామతి వెళుతుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ముంబయి నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకువిమానం రెండు ముక్కలైనట్లు తెలుస్తోంది. విమాన ప్రమాదంపై డీజీసీఏ () స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్‌తో పాటు ముంబయి పీఎస్‌వో వదీప్ జాదవ్, కెప్టెన్ సుమిత్ కపూర్, కెప్టెన్ శాంభవి పాఠక్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి మరణించినట్లు తెలిపింది.

### గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ



తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిర్ఇండియా విమానప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్య మంత్రి విజయ్ రూపానీ దుర్మరణం పాలయ్యారు. లండన్‌లో నివసిస్తున్న ఆయన కుమార్తె రాధికను కలిసేందుకు జూన్ 12న అహ్మదాబాద్ నుంచి విజయ్ రూపానీ బయలుదేరారు. అయితే టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే విమానం మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలోని 242 మంది పాటు విద్యార్థులు కలిపి సుమారు 270 పైనే ఉన్నట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది.

### అరుణాచల్‌లో సీఎం దోర్జీ ఖండు



అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండు 2011 ఏప్రిల్ 30న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి డోర్జీ ఖండూ, పవన్ హన్స్ హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుండగా, గ్రౌండ్ కంట్రోల్‌తో సంబంధం కోల్పోయిన తర్వాత కూలిపోయిందితవాంగ్ నుంచి ఇటానగర్‌కు ప్రయాణిస్తున్న సమయంలో వెస్ట్ కామెంగ్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగింది

**అరుణా చల్ మంత్రులు :** 2004లో అరుణాచల్ ప్రదేశ్ మంత్రి డెరా నటుంగ్ మేఘాలయ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ మంత్రి సి. సంగ్మా, హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

### హోమీ బాబా విమానం క్రాష్



భారత అణు కార్యక్రమానికి పునాది వేసిన మహానుభావుడు డాక్టర్ హోమీ భాభా. 1966 జనవరి 24న ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్101 స్విట్జర్లాండ్‌లోని మోంట్ బ్లాంక్ పర్వత శ్రేణుల్లో కూలిపోయింది. పైలట్లు, జెనీవా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మధ్య సమన్వయ లోపమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని దర్యాప్తులో తేలింది.

### ప్రమాదంలో ఎర్రంనాయుడు మృతి



రాజకీయ రంగానికి చెందిన అనేకమంది ప్రముఖులు రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. ఈ జాబితా చాలా పెద్దది. ఇందులో ముందుగా అందరికీ గుర్తుకువచ్చేది తెలుగుదేశం పార్టీకి చెందిన ఎర్రన్నాయుడు. 2012 నవంబర్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రన్నాయుడు చనిపోయారు. ఒక వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా ఎర్రన్నాయుడు ప్రయాణిస్తున్న వాహనం శ్రీకాకుళం జిల్లారణస్థలం మండలం దండానపేట కూడలి వద్ద రహదారికి అడ్డం గా ఉన్న ట్యాంకర్ కి ఢీకొంది. దీంతో ఎర్రన్నాయుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ఆ తరువాత చనిపోయారు.

### సంజయ్ గాంధీ



మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ 1980 జూన్ 23న విమాన ప్రమాదంలో మరణించారు. అనుభవజ్ఞుడైన పైలట్ అయిన ఆయన, దిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన చిన్న విమానంలో సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఏరోబాటిక్స్ చేస్తుండగా అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి కూలిపోయారు. 1977లో ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై జరిగిన హత్యాయత్నం నుంచి తప్పించుకున్నప్పటికీ, ఈ ప్రమాదం నుంచి మాత్రం బయటపడలేకపోయారు.

### మాధవ్‌రావ్ సింధియా



కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి మాధవరావు సింధియా విమాన ప్రమాదంలో 2001 సెప్టెంబర్ 30న కన్నుమూశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు ఎన్నికల సభకు వెళుతుండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన ప్రయాణిస్తున్న 10 సీట్ల ప్రైవేట్ విమానం మైన్‌పురి సమీపంలో కూలిపోయింది.

### జీఎంసీ బాలయోగి



మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ప్రైవేట్ హెలికాప్టర్ కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని చెరువులో కూలిపోయింది.

### సైప్రియన్ సంగ్మా

మేఘాలయ రాష్ట్ర మంత్రి సైప్రియన్ సంగ్మా సహా మరో తొమ్మిది మంది 2004 సెప్టెంబర్ 22న పవన్ హాన్స్ హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. గువాహటి నుంచి షిల్లాంగ్‌కు వెళ్తుండగా, బారాపానీ సరస్సు సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది.

### కుమార మంగళం బిర్లా



1973లో జరిగిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ప్రమాదంలో కుమార మంగళం బిర్లా చనిపోయారు. ఇందిరా గాంధీ ప్రభుత్వంలో స్టీల్ మంత్రిగా ఉన్నారు.

### పంజాబ్ గవర్నర్ సురేంద్ర నాథ్



. 1994లో పంజాబ్ గవర్నర్ విధులతో పాటు హిమాచల్ ప్రదేశ్ యాక్టింగ్ గవర్నర్ ఉన్న సురేంద్ర నాథ్, తన కుటుంబంలోని 9 మంది సభ్యులతో సహా, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సూపర్-కింగ్ విమానంలో ప్రయాణిస్తూ హిమాచల్ ప్రదేశ్‌లోని పర్వతాల్లో కూలిపోవడంతో మరణించారు.

### సినీ నటి సౌందర్య



ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న విమాన ప్రమాదంలో మృతి చెందారు. బెంగళూరు జక్కూర్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి కరీంనగర్‌కు బయలుదేరిన సెస్నా సింగిల్ ఇంజిన్ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. అప్పటికి ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమెతో పాటు నలుగురు ఈ ప్రమాదంలో మరణించారు.

### పారిశ్రామికవేత్త ఓం ప్రకాశ్ జిందాల్



ప్రముఖ పారిశ్రామికవేత్త, హరియాణా మంత్రి ఓం ప్రకాశ్ జిందాల్ 2005 మార్చి 31న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. దిల్లీ నుంచి చండీగఢ్‌కు వెళ్తుండగా, ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో హర్యానా వ్యవసాయ మంత్రి సురేంద్ర సింగ్ కూడాఉన్నారు



### భారత తొలి సీడీఎస్ బిపిన్ రావత్



భారతదేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. సూలూర్ నుంచి వెల్లింగ్టన్‌కు వెళ్తుండగా, తమిళనాడులోని కూనూర్ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన భార్యతో పాటు మరో 11 మంది మరణించారు.

### హరికృష్ణ నందమూరి



2013 ఆగస్టులో నందమూరి హరికృష్ణ రోడ్ యాక్సిడెంట్‌లో చనిపోయారు. ఒక వివాహ కార్యక్రమానికి హాజరవడానికి నెల్లూరు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో హరికృష్ణయే స్వయంగా కారు నడుపుతున్నారు. నల్గొండ సమీపంలోని అన్నేపర్తి వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదం ఫలితంగా హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో హరికృష్ణను హుటాహుటిన నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హరికృష్ణ మృతిచెందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో నందమూరి హరికృష్ణ కీలకపాత్ర పోషించారు. ఎన్టీఆర్ ప్రయాణించిన చైతన్యరథానికి సారథిగా వ్యవహరించారు. ఆ తరువాత చంద్రబాబునాయుడు క్యాబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు.

### శోభానాగిరెడ్డి



2014లో సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రముఖ రాజకీయవేత్త శోభా నాగిరెడ్డి రోడ్డు ప్రమాదం కారణంగా చనిపో యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల ప్రాంతంలో భూమా వర్గానికి రాజకీయంగా మంచి పట్టుంది. భర్త నాగిరెడ్డి రాజకీయాలకు శోభ చేదోడువాదోడుగా ఉండేవారు. శోభా నాగిరెడ్డికి రాష్ట్రస్థాయిలో కూడా మంచి గుర్తింపు ఉంది. భవిష్యత్తులో శోభా నాగరెడ్డి రాజకీయంగా రాష్ట్ర స్థాయి నాయకురాలు అవుతారన్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆమెను బలిగొంది.

### పటోళ్ల ఇంద్రారెడ్డి



తెలంగాణకు చెందిన రాజకీయ ప్రముఖుడు పటోళ్ల ఇంద్రారెడ్డి కూడా రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. 2000 ఏప్రిల్ 22న ఓ వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. శంషాబాద్ సమీపంలోని పాల్మకూరు గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది. అప్పటి ఎన్టీ రామారావు మంత్రివర్గంలో విద్యా, కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా ఇంద్రారెడ్డి పనిచేశారు. ఆ తరువాత 1989, 1994లో జరిగిన ఎన్నికల్లో వరుసగా గెలిచారు. ఎన్టీ రామారావు క్యాబినెట్‌లో హోం, జైళ్లు, అగ్నిమాపక శాఖ మంత్రిగా ఇంద్రారెడ్డి పనిచేశారు.

**వెంకటేశ్వర్ దాస్ - సూర్య కల్చరల్ రిపోర్టర్**
**- విశాఖపట్నం - 1 99892 65111**

### వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్తూరు జిల్లాలో రచ్చ బండ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు 2009 సెప్టెంబర్ 2న హెలికాప్టర్‌లో హైద్రాబాద్ బేగంపేట విమానాశ్ర యం నుండి చిత్తూరు జిల్లాకు బయలుదేరారు. బేగంపేట విమానాశ్రయం నుండి బయలుదేరిన కొద్దిసేపటికే రాజశేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఏటీసీతో సంబంధాలు కోల్పోయింది. సీఎం ప్రయాణీస్తున్న హెలికాప్టర్ మిస్సింగ్ కావడంతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. రక్షణ శాఖకు చెందిన ఆధునాతన విమానాలు, హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. నల్లమల అడవు ల్లోని పావురాలగుట్ట వద్ద వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రయాణించిన హెలికాప్టర్ శకలాలను గుర్తించారు. ఈ ప్రమాదంలో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సహా వ్యక్తి గత సిబ్బంది మృత్యువాత పడ్డారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి, 2009 సెప్టెంబర్ 2న బెల్430 హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ అదుపుతప్పి కూలిపోయింది.

# డబ్ల్యూటీసీ పాయింట్ల ఒత్తిడి

**- పిచ్‌ల తయారీపై రాహుల్ ద్రవిడ్ సంచలన వ్యాఖ్యలు!**

**డబ్ల్యూటీసీ పాయింట్ల కోసం హోమ్ టీమ్స్ అన్నీ రిజల్ట్ ఓరియెంటెడ్ పిచ్‌లనే కోరుకుంటున్నాయ్**

**- ప్రతి మ్యాచ్ గెలవాలనే ఒత్తిడి పెరగడం వల్ల పిచ్‌ల స్వభావం మారుతోంది- ద్రవిడ్ కామెంట్స్**



టెస్ట్ క్రికెట్ అంటే ఒకప్పుడు ఐదు రోజుల పాటు ఓపికతో ఆడే ఆట. కానీ ఇప్పుడు సీన్ మొత్తం మారిపోయింది. కేవలం మూడు లేదా నాలుగు రోజుల్లోనే మ్యాచ్‌లు ముగిసిపోతున్నాయి. అసలు బ్యాటర్లు తడబడటానికి బౌలర్లు రెచ్చిపోవడానికి కారణం కేవలం టెక్నిక్ లోపమేనా? లేక దీని వెనుక ఏదైనా బలమైన కారణం ఉందా? ఈ విషయంలో టీమ్ ఇండియా మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. డబ్ల్యూటీసీ పాయింట్ల వేటలో పడి అసలైన టెస్ట్ క్రికెట్ మజా ఎక్కడో మిస్ అవుతోందనే సంకేతాలను ఆయన ఇచ్చారు. ద్రవిడ్ ఏమన్నారనే వివరాల్లోకి వెళితే!

**పాయింట్ల ఒత్తిడి- మారిన పిచ్‌ల తీరు**

డబ్ల్యూటీసీ పాయింట్ల ప్రాముఖ్యం పెరగడంతో హోమ్ టీమ్స్‌పై ప్రతి మ్యాచ్ గెలవాలనే ఒత్తిడి విపరీతంగా పెరిగిపోయిందని రాహుల్ ద్రవిడ్ అభిప్రాయపడ్డారు. పాత రోజుల్లో మనం కేవలం సిరీస్ గెలిస్తే చాలు అనుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ప్రతి టెస్ట్ మ్యాచ్ రిజల్ట్ పాయింట్ల పట్టికపై ప్రభావం చూపుతోంది అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒత్తిడి వల్లే పిచ్ క్యూరేటర్లు ఫలితం వచ్చేలా, అంటే బౌలర్లకు ఎక్కువగా అనుకూలించేలా వికెట్లను తయారు చేస్తున్నారని ద్రవిడ్ వివరించారు. దీనివల్ల బ్యాటర్లు క్రీజులో నిలబడటం కష్టతరంగా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఇండియాలోనే కాదు- ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి!**

చాలామంది కేవలం ఇండియాలోనే పిచ్‌లు బౌలర్లకు సహకరిస్తాయని భావిస్తుంటారు. కానీ ద్రవిడ్ ఈ వాదనను కొట్టిపారేశారు. డబ్ల్యూటీసీ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఫలితం ఆధారిత పిచ్‌లే కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. హోమ్ అడ్వాంటేజ్‌ను వాడుకుంటూ ప్రత్యర్థిని దెబ్బకొట్టడానికి ప్రతి దేశం బౌలర్లకు అనుకూలించే వికెట్లనే కోరుకుంటోంది. ఎవరూ కూడా మ్యాచ్ డ్రా అవ్వాలని కోరుకోవడం లేదని, ఫలితం కోసం పిచ్‌లను ఎక్స్‌ట్రీమ్ కండిషన్స్‌లోకి తీసుకెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను కోచ్‌గా ఉన్న సమయంలో కూడా ఈ పాయింట్ల ఒత్తిడిని చాలాసార్లు అనుభవించానని ద్రవిడ్ గుర్తు చేసుకున్నారు.

**పాయింట్ల పట్టికలో వెనుకబడ్డ భారత్**

ప్రస్తుతం జరుగుతున్న డబ్ల్యూటీసీ (2025-27) సైకిల్‌లో టీమ్ ఇండియా పరిస్థితి ఏమంత బాగోలేదు. తాజాగా అందుబాటులో ఉన్న పాయింట్ల పట్టిక ప్రకారం భారత్ 9 మ్యాచుల్లో 4 విజయాలు, 4 ఓటములతో ఆరో స్థానంలో కొనసాగుతోంది. భారత్ విన్నింగ్ పర్సంటేజ్ కేవలం 48.15 శాతంగానే ఉంది. ఆస్ట్రేలియా 87.50 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, న్యూజిలాండ్, సౌత్ ఆఫ్రికా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. భారత్ గనుక 2027లో జరిగే ఫైనల్ చేరాలంటే రాబోయే సిరీస్‌ల్లో ప్రతి మ్యాచ్‌ను అత్యంత భారీ తేడాతో గెలవాల్సి ఉంటుంది.

**గత ప్రదర్శన- ఎదురైన సవాళ్లు**

టీమ్ ఇండియా తన డబ్ల్యూటీసీ ప్రయాణంలో ఇప్పటివరకు మిశ్రమ ఫలితాలను అందుకుంది. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకోగా, వెస్ట్ ఇండీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. అయితే సౌత్ ఆఫ్రికా చేతిలో సొంతగడ్డపైనే 0-2తో వైట్‌వాష్ అవ్వడం భారత్ అవకాశాలను దెబ్బతీసింది. పిచ్‌లు బౌలర్లకు ఎక్కువగా సహకరించడం వల్ల మన బ్యాటర్లు వరుసగా విఫలమవ్వడం ఇక్కడ గమనించాల్సిన విషయం. కేవలం ఫలితం కోసమే వికెట్లు తయారు చేయడం వల్ల టెస్ట్ క్రికెట్లో ఉండే సహజమైన బ్యాటింగ్ క్లాస్ తగ్గిపోతోందని విశ్లేషకులు కూడా భావిస్తున్నారు.

**ఫైనల్ చేరే అవకాశాలు ఎంత?**

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికను గమనిస్తే భారత్ కంటే పాకిస్థాన్ మెరుగైన స్థానంలో ఉండటం గమనార్హం. రాహుల్ ద్రవిడ్ చెప్పినట్లుగా ఫలితాల కోసం చూసే క్రమంలో బ్యాటింగ్ వైఫల్యాలు ఎదురవ్వకుండా జాగ్రత్త పడితేనే టీమ్ ఇండియా తన ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోగలదు. పిచ్‌ల తయారీలో సమతుల్యత పాటిస్తూ స్వదేశంలో జరిగే మ్యాచుల్లో గరిష్ఠ పాయింట్లు సాధించడం ఇప్పుడు టీమ్ ఇండియా ముందున్న ఏకైక మార్గం. డబ్ల్యూటీసీ ఒత్తిడిని అధిగమించి భారత్ అద్భుతం సృష్టిస్తుందో లేదో వేచి చూడాలి. ఏదేమైనా టెస్ట్ క్రికెట్‌లో పిచ్‌ల తయారీ అనేది డబ్ల్యూటీసీ పాయింట్ల చుట్టూ తిరుగుతోంది. రాహుల్ ద్రవిడ్ చేసిన ఈ కామెంట్స్ పిచ్ క్యూరేటర్లకు టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఒక కొత్త ఆలోచనను ఇస్తోంది. మరి రాబోయే మ్యాచుల్లో టీమ్ ఇండియా ఎలాంటి పిచ్‌లపై ఆడుతుందో వేచి చూడాలి.

## రిటైర్మెంట్ అంత కష్టం కాదు



దిల్లీ: రిటైర్మెంట్ ఆలోచన తనకు రాకపోలేదని, కానీ దానికి ఇంకా కొంత సమయం ఉందని టీమ్‌ఇండియా బ్యాటర్ కేఎల్ రాహుల్ అన్నాడు. సమయం వచ్చినప్పుడు రిటైరవుతానని, కెరీర్‌ను సాగదీయనని చెప్పాడు. "రిటైర్మెంట్ గురించి ఆలోచించా. అది అంత కష్టమైందని అనుకోవట్లేదు. మన పట్ల మనం నిజాయితీగా ఉంటే సమయం వచ్చినప్పుడు రిటైర్ కావాలి. సాగదీయడంలో అర్థం లేదు. కానీ నా రిటైర్మెంట్‌కు ఇంకా సమయం ఉంది" అని రాహుల్ అన్నాడు. 33 ఏళ్ల రాహుల్ 67 టెస్టుల్లో 35.8 సగటుతో 4053 పరుగులు చేశాడు. 94 వన్డేల్లో 50.9 సగటుతో 3360, 72 టీ20ల్లో 37.75 సగటుతో 2265 పరుగులు చేశాడు. తాను మరీ ముఖ్యుడిని అని అనుకోనని రాహుల్ చెప్పాడు. "సమయం వచ్చినప్పుడు రిటైరవుతా. నేను మరీ అంత ముఖ్యుడిని కాదని నాకు నేను చెప్పుకొంటా. దేశంలో క్రికెట్ కొనసాగుతుంది. ప్రపంచంలో క్రికెట్ కొనసాగుతుంది. జీవితంలో ముఖ్యమైనవి ఇంకా ఎన్నో ఉన్నాయి. మొదటి నుంచి నా ఆలోచనలు ఇలాగే ఉన్నాయి. కానీ మా పాప పుట్టాక నేను జీవితాన్ని చూసే తీరు పూర్తిగా మారిపోయింది" అని అన్నాడు.

## టీ20 ర్యాంకింగ్స్

**మళ్లీ టాప్-10లోకి సూర్యకుమార్ యాదవ్**



భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టీ20 ర్యాంకింగ్స్‌లో తిరిగి టాప్-10లోకి దూసుకొచ్చాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్య.. ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. టీ20 ప్రపంచ కప్ మరికొన్ని రోజుల్లో మొదలుకానున్న తరుణంలో 'స్కై' ఫామ్‌లోకి రావడంతో టీమ్‌ఇండియా అభిమానులు ఖుషీ అవుతున్నారు. న్యూజిలాండ్‌లో సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో సూర్య 37 బంతుల్లోనే 82 పరుగులు, మూడో టీ20లో 26 బంతుల్లోనే 57 రన్స్ చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కివీస్‌తో మిగిలిన రెండు మ్యాచ్‌లతోపాటు పొట్టి కప్‌లోనూ టీమ్‌ఇండియా సారథి ఇదే జోరు కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇక, సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్న ఓపెనర్ అభిషేక్ శర్మ (929 రేటింగ్ పాయింట్లు) అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. కివీస్‌తో మూడో టీ20లో అభిషేక్ ( ) 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేయగా.. నాగ్‌పూర్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ (849), తిలక్ వర్మ (781) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. టీమ్‌ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు మెరుగై 13వ ర్యాంక్‌లో నిలిచాడు. వరుణ్ చక్రవర్తి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్య ఒక స్థానం మెరుగుపర్చుకుని మూడో స్థానంలో నిలవగా.. శివమ్ దూబె ఆరు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్ దక్కించుకున్నాడు. అక్షర్ పటేల్ మూడు స్థానాలు పడిపోయి 13వ ర్యాంక్‌లో ఉన్నాడు.

## టీమిండియాకు విశాఖ ఆతిథ్యం

**ఇదీ నారా లోకేష్ రేంజ్!**



విశాఖపట్నం అభివృద్ధిలో దూసుకుపోతోంది. కాస్మోపాలిటన్ నగరంగా ఎదగడానికి బలంగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు ఒక్కసారిగా మారిపోతున్నాయి. ఇప్పటికే ప్రఖ్యాతమైన ఐటీ సంస్థలు విశాఖపట్నంలో తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

గూగుల్ నుంచి మొదలు పెడితే టి సి ఎస్ వరకు అన్ని సంస్థలు విశాఖపట్నం వేదికగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇది ఇలా ఉండగానే విశాఖపట్నం క్రికెట్ హబ్ గా మారబోతోంది. విశాఖపట్నంలో ఉన్న అంతర్జాతీయ స్టేడియంలో వరుసగా మ్యాచ్ లు జరుగుతుండడమే ఇందుకు ప్రధాన కారణం. టీమిండియా న్యూజిలాండ్ జట్టుతో ప్రస్తుతం ఐదు టి 20 మ్యాచ్ల సిరీస్ ఆడుతోంది. ఇందులో భాగంగా బుధవారం కివీస్ జట్టుతో విశాఖపట్నం వేదికగా నాలుగవ టి20 మ్యాచ్ ఆడబోతోంది. గడిచిన 4 నెలల కాలంలో విశాఖపట్నంలో ఇది నాల్గవ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్. పురుషులకు భాగంలో రెండవ క్రికెట్ మ్యాచ్. భారత దేశంలో ఈ స్టేడియం కూడా ఇన్ని మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వలేదు.

గత ఏడాది అక్టోబర్ లో మహిళల వన్డే వరల్డ్ కప్ జరిగింది. ఈ టోర్నీలో ఐదు మ్యాచ్ లకు విశాఖపట్నం మైదానం ఆతిథ్యం ఇచ్చింది. ఆ తర్వాత శ్రీలంక జట్టుతో జరిగిన భారత మహిళ టి20 సిరీస్లో రెండు మ్యాచ్ లకు వేదికగా నిలిచింది. సౌత్ ఆఫ్రికా జట్టుతో భారత పురుషులు ఆడిన మూడో వన్డే కూడా విశాఖపట్నం వేదికగా జరిగింది. ఇప్పుడు న్యూజిలాండ్ జట్టుతో జరుగుతున్న నాలుగో టి20 మ్యాచ్ కు విశాఖపట్నం వేదిక అయింది.

నాలుగు నెలల కాలంలోనే విశాఖపట్నం మైదానం ఇన్ని మ్యాచ్లకు వేదిక కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేష్ చూపించిన చొరవ వల్ల ఈ స్థాయిలో మ్యాచ్లో జరుగుతున్నాయని క్రికెట్ ఫ్యాన్స్ పేర్కొంటున్నారు. బీసీసీఐ రొటేషన్ పాలసీ పాటిస్తూ ఉంటుంది. దాని ప్రకారం ఒక ఏడాదిలో ఒక స్టేడియంలో ఒకే ఒక అంతర్జాతీయ మ్యాచ్ జరుగుతుంది. కానీ లోకేష్ చొరవ చూపించడంతో తొమ్మిది మ్యాచ్ లకు విశాఖపట్నం ఆతిథ్యం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. దానికి తోడు జై షా తో లోకేష్ కు మంచి అనుబంధం ఉంది. అందువల్లే ఇదంతా సాధ్యమవుతుందని క్రికెట్ అభిమానులు పేర్కొంటున్నారు.ఇక గడిచిన రెండు సంవత్సరాలుగా ఉప్పల్ మైదానంలో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా జరగలేదు. హైదరాబాదులోని ఉప్పల్ స్టేడియంలో 2024 లో జనవరి 25 నుంచి 29 మధ్య ఇంగ్లాండ్ జట్టుతో భారత్ టెస్ట్ మ్యాచ్ ఆడింది. అదే ఏడాది అక్టోబర్లో బంగ్లాదేశ్ జట్టుతో జరిగిన టి20 మ్యాచ్లో భారత్ తలపడింది. ఇక అనంతరం ఐపీఎల్ మినహా.. ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఉప్పల్ మైదానంలో జరగకపోవడం గమనార్హం.

# విశాఖవేదికగా నాలుగో టీ20 మ్యాచ్

**రిజర్వ్ బెంచ్‌లో వరుణ్ చక్రవర్తి - టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానంలో వరుణ్**



మరికొన్ని గంటల్లో భారత్, న్యూజిలాండ్ జట్లు విశాఖపట్నం వేదికగా నాలుగో టీ20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఇప్పటికే మొదటి మూడు మ్యాచుల్లో విజయం సాధించిన భారత్.. 3-0 తేడాతో సిరీస్‌ను ఖాయం చేసుకుంది. అయినప్పటికీ ఈ సిరీస్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఎందుకంటే ఈ సిరీస్ ముగిసిన వెంటనే ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026 ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో అన్ని మ్యాచుల్లోనూ ఆడించాలంటూ సీనియర్ క్రికెటర్ అజింక్య రహానే తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. వరల్డ్‌కప్‌కు ముందు ప్రధాన బౌలర్లను రిజర్వ్ బెంచ్‌లో ఉంచాల్సిన అవసరం ఉందన్నాడు.

'న్యూజిలాండ్‌తో 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ పూర్తయిన వెంటనే టీ20 వరల్డ్‌కప్ 2026 జరగనుంది. వరుణ్ చక్రవర్తి మన ప్రధాన బౌలర్. పొట్టి ఫార్మాట్‌లో బౌలర్ రిథమ్ చాలా కీలకం. అతడిని వరల్డ్‌కప్‌కు ముందు జరగబోయే మ్యాచ్‌లలో రిజర్వ్ బెంచ్‌కే పరిమితం చేయడం సరైన నిర్ణయం కాదు. మేము కేవలం నీకు విశ్రాంతి ఇస్తున్నాం, రవి బిష్ణోయ్‌ను పరీక్షిస్తున్నామని చెప్పినా.. అది వరుణ్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందో చెప్పలేం' అని అజింక్య రహానే అన్నాడు. ప్రస్తుతం వరుణ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో 804 పాయింట్లతో నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా టీ20 వరల్డ్‌కప్ 2026 ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీలో భారత జట్టుకు వరుణ్ చక్రవర్తి ప్రధాన ఆయుధంగా మారనున్నాడు. మిస్టరీ స్పిన్‌తో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టే సామర్థ్యం అతడికి అదనపు బలం. ఇప్పటికే న్యూజిలాండ్‌పై 3-0తో సిరీస్ గెలిచిన భారత్.. చివరి రెండు టీ20ల్లో ప్రయోగాలు చేసే అవకాశాలు ఉన్నాయి. మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఆడిన వరుణ్.. విశ్రాంతి పేరుతో మూడో టీ20లో ఆడలేదు. అతడి స్థానంలో రవి బిష్ణోయ్‌ను తుది జట్టులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపైనే రహానే వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# టీ20 ఫార్మాట్‌లో అభిషేక్ తుఫాన్ ఇన్నింగ్స్‌లు

**అభిషేక్ శర్మపై మహమ్మద్ కైఫ్ ప్రశంసలు - క్రిస్ గేల్ కన్నా అభిషేక్ డేంజరస్ బ్యాటర్**



అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో తుఫాన్ ఇన్నింగ్స్‌లు ఆడుతున్న టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మపై మాజీ భారత బ్యాటర్ మహమ్మద్ కైఫ్ ప్రశంసలు కురిపించారు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ కన్నా అభిషేక్ విధ్వంసకరమైన ఆటగాడని పేర్కొన్నారు. అభిషేక్ ఆడితే భారత్ గెలవడం ఖాయం అని, టీమిండియాకు దొరికిన ఆణిముత్యం అని అని కైఫ్ చెప్పుకొచ్చారు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడవ టీ20లో అభిషేక్ చెలరేగాడు. 20 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సులతో 68 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌లలో 271. 43 స్ట్రైక్ రేట్, 76.00 సగటుతో 152 పరుగులు చేశాడు.మహమ్మద్ కైఫ్ తన యూట్యూబ్ చానల్‌లో మాట్లాడుతూ.. అగ్రెసివ్ ఓపెనర్స్, అభిషేక్ శర్మ మధ్య తేడా ఏమిటో వివరించారు. 'సాధారణంగా దూకుడుగా ఆడే బ్యాటర్లకు నిలకడ, ఫామ్ ఉండదు. చాలామంది సీనియర్ ప్లేయర్లను నేను చూశాను. క్రిస్ గేల్ ఇలాగే భారీ షాట్లు కొడతాడు. కానీ అతడు స్మార్ట్ క్రికెట్ ఆడేవాడు. మొదటి ఓవర్లలో చాలా జాగ్రత్తగా బ్యాటింగ్ చేసేవాడు. అవసరం అయితే మెయిడిన్ ఓవర్లు ఆడేవాడు. ఆ తర్వాత వేగం పెంచేవాడు. బెంగళూరు లాంటి పిచ్‌ల మీద నెమ్మదిగా ఇన్నింగ్స్ ఆరంభించి.. తర్వాత వేగం పెంచేవాడు' అని కైఫ్ అన్నాడు.

'అభిషేక్ శర్మ మొదటి బాల్ నుంచే అటాక్ చేస్తాడు. ఇలా ఆడే బ్యాటర్లకు సాధారణంగా నిలకడ ఉండదు. ఒక మంచి ఇన్నింగ్స్ ఆడితే.. ఆ తర్వాత విఫలవుతారు. కానీ అభిషేక్ ప్రతి మ్యాచ్‌లో చెలరేగుతున్నాడు. 1214 బాల్స్ ఆడినా 6070 పరుగులు చేస్తున్నాడు. అదే అతడిని మాచ్-విన్నర్‌గా మార్చుతుంది. అభిషేక్ ఆడితే భారత్ గెలవడం ఖాయం' అని మహమ్మద్ కైఫ్ ప్రశంసలు కురిపించారు. మూడవ టీ20లో అభిషేక్ అద్భుత ఇన్నింగ్స్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి 102 పరుగుల పార్ట్‌నర్‌షిప్ నిర్మించి.. జట్టుకు 10 ఓవర్లలో విజయం అందించాడు.

క్రిస్ గేల్ తరహా లెఫ్ట్ హ్యాండెడ్ ఓపెనర్ అభిషేక్ శర్మ. పవర్ ప్లేలో బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. ఈ దూకుడే అతడిని ప్రత్యేకంగా నిలిచేలా చేసింది. 25 ఏళ్ల వయసులో ఇలా ఆడడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 36 టీ20ల్లో 38.39 సగటు, 195.22 స్ట్రైక్ రేట్‌తో 1,267 పరుగులు చేశాడు. ఇప్పటికే 8 ఫిఫ్టీస్, 2 సెంచరీస్ సాధించిన అభిషేక్.. భారత్‌కి రేర్, రెలయబుల్ డెస్ట్రాయర్‌గా మారాడు. టీ20 ప్రపంచకప్ 2026లో అభిషేక్ ఆట టీమిండియాకు విజయాలు అందించనుంది.

## మీరు ఆడుతారా, లేదా త్వరగా చెప్పండి..

**పాకిస్తాన్‌ను ట్రోల్ చేసిన ఐస్లాండ్..**



టీ20 ప్రపంచ కప్ నుంచి బంగ్లాదేశ్ అవుట్ అయింది. భారత్‌లో ఆడేందుకు భద్రతా కారణాలు చూపుతూ వివాదం చేసిన బంగ్లాదేశ్ స్థానంలో ఐసీసీ స్కాట్లాండ్‌ను తీసుకుంది. ఇదిలా ఉంటే, బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్తాన్ కూడా టోలర్నీని బాయ్‌కాట్ చేస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, దీనిపై ఐస్లాండ్ పాకిస్తాన్‌పై ట్రోలింగ్ చేస్తుంది. ఐస్లాండ్ క్రికెట్ సోషల్ మీడియాలో .." పాకిస్తాన్ టోర్నీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంటే తాము జోక్యం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాము" అని సెటైర్లు వేసింది. "టీ20 వరల్డ్ కప్ ఆడటంపై పాకిస్తాన్ త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మాకు ఉంది. ఫిబ్రవరి 2న వారు వైదొలిగితే, వెంటనే మేము బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నాము. కానీ ఫిబ్రవరి 7న విమాన షెడ్యూల్ కారణంగా కొలంబో చేరుతామో లేదో. " అంటూ పోస్ట్ చేసింది.అయితే, బంగ్లాదేశ్‌కు మద్దతుగా తాము కూడా టోర్నీని బహిష్కరిస్తామని పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్(పీసీబీ) అధికారులు కామెంట్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ, ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో భేటీ అయ్యారు. ఈ శుక్రవారం లేదా సోమవారం తమ నిర్ణయం వెల్లడిస్తామని నఖ్వీ చెప్పారు. తమకు లాగే బంగ్లాదేశ్‌కు కూడా తటస్థ వేదికలపై ఆడేందుకు అవకాశం ఇవ్వాలని నఖ్వీ డిమాండ్ చేశారు. పాక్ తన అన్ని మ్యాచుల్ని శ్రీలంకలో ఆడుతోంది. బంగ్లాదేశ్ కూడా తాము భారత్‌లో ఆడమని తమ వేదికల్ని కూడా శ్రీలంకు మార్చాలని డిమాండ్ చేసింది. అయితే, ఐసీసీ అంగీకరించపోవడంతో టోర్నీ నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చింది.

## జెమీమా రోడ్రిగ్స్‌కు బిగ్ షాక్



భారత మహిళా జట్టు స్టార్ ప్లేయర్, ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్‌కు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. డబ్ల్యూపీఎల్-2026 డీసీ జట్టు సారథిగా ప్రమోషన్ పొందిన జెమీమా.. కెప్టెన్‌గా ఆకట్టుకోలేకపోతోంది. ఇప్పటికే ఈ టీమిండియా స్టార్ సారథ్యంలో వరుస పరాజయాలు చవిచూసిన ఢిల్లీ జట్టు.. తాజాగా మంగళవారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ స్వల్ప పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఫలితంగా ఇప్పటికి ఏడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఢిల్లీ ఖాతాలో నాలుగో పరాజయం నమోదైంది.

గుజరాత్ చేతిలో ఓటమితో షాక్‌లో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. స్లో ఓవర్ కారణంగా ఆమెకు జరిమానా పడింది. గుజరాత్‌తో మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి చేయనందున జెమీమాకు రూ. 12 లక్షల జరిమానా పడింది. ఈ విషయాన్ని డబ్ల్యూపీఎల్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

'వడోదర వేదికగా మంగళవారం గుజరాత్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో స్లో ఓవర్ కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్‌కు జరిమానా విధించడమైనది. ఈ సీజన్‌లో ఆమె స్లో ఓవర్ రేట్ మెయింటెన్ చేయడం ఇదే తొలిసారి. కావున డబ్ల్యూపీఎల్ నిబంధనల ప్రకారం రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టాము' అని డబ్ల్యూపీఎల్ యాజమాన్యం పేర్కొంది. ప్రపంచ కప్-2025 సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచులో జెమీమా (127 పరుగులు)అద్భుతమైన బ్యాటింగ్ తో ఓవర్ నైట్ స్టార్ అయింది.

ఇంకా చెప్పాలంటే.. ఆ మ్యాచుతోనే జెమీమా గురించి ప్రపంచానికి బాగా తెలిసింది. ప్రపంచ కప్‌లో వచ్చిన ఫేమ్‌తో ఆమెకు డబ్ల్యూపీఎల్‌లో ప్రమోషన్ వచ్చింది. ఢిల్లీ కెప్టెన్ గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సీజన్‌లో ఢిల్లీకి కప్ అందించాలని జెమీమా భావించింది. అయితే అందుకు భిన్నంగా ఢిల్లీ ఓటములు చవిచూస్తుంది. ప్రస్తుతం పాయింట్స్ పట్టికలో డీసీ నాలుగో స్థానంలో ఉంది. తన చివరి మ్యాచ్ యూపీ వారియర్స్‌తో ఫిబ్రవరి 1న తలపడనుంది.

సూర్య www.suryaa.com

# సినిమా

## బన్నీ సినిమానే సమాధానమా..?

ఎలాగు పుష్ప సినిమాతో పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకున్న అల్లు అర్జున్ తో సినిమా అంటే యునానిమస్ గా సూపర్ క్రేజ్ ఉంటుంది. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ పై మీడియాలో జరుగుతున్న చర్చలు తెలిసిందే. కోలీవుడ్ కి 1000 కోట్లు తెచ్చే డైరెక్టర్ అతనే అంటూ కూలీ రిలీజ్ ముందు వరకు చెప్పిన వాళ్లే ఆఫ్టర్ కూలీ రిలీజ్ అతన్ని టార్గెట్ చేస్తూ కామెంట్ చేస్తున్నారు. తన మీద సోషల్ మీడియాలో జరుగుతున్న డిస్కషన్ కి ఎండ్ కార్డ్ పెట్టే ప్రయత్నం చేశాడు లోకేష్. అంతేకాదు అల్లు అర్జున్ తో సినిమా ఆరేళ్ల క్రితం నుంచి డిస్కషన్ లో ఉందని మైత్రి మూవీ మేకర్స్ అప్పుడే తనకు అడ్వాన్స్ ఇచ్చారని క్లారిటీ ఇచ్చాడు లోకేష్ కనకరాజ్. అంతేకాదు ఖైదీ 2 తో పాటు తన సినిమాటిక్ యూనివర్స్ కూడా కొనసాగుతాయని అన్నాడు. లోకేష్ ప్రెస్ మీట్ లో నెక్స్ట్ తాను చేయాలనుకుంటున్న ప్రాజెక్ట్ ల గురించి చెప్పాడు. ఐతే హిట్టు ఇచ్చినప్పుడు ప్రశంసించడం.. ఫ్లాపులు పడితే విమర్శించడం కామనే. ఆ విషయం తెలుసు కాబట్టే అల్లు అర్జున్ సినిమాతో తానేంటో ప్రూవ్ చేయాలని ఫిక్స్ అయ్యాడు లోకేష్ కనకరాజ్. అల్లు అర్జున్ తో లోకేష్ సినిమా.. ఎలాగు పుష్ప సినిమాతో పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకున్న అల్లు అర్జున్ తో సినిమా అంటే యునానిమస్ గా సూపర్ క్రేజ్ ఉంటుంది. ఐతే ఈ సినిమా కథ ఏంటి తన డ్రీమ్ ప్రాజెక్ట్ గా రాసుకున్న కథతోనే లోకేష్ ఈ సినిమా చేస్తున్నాడా లాంటి విషయాల మీద క్లారిటీ రావాల్సి ఉంది. ఏది ఏమైనా లోకేష్ మళ్లీ తిరిగి హిట్ కొట్టే వరకు ఇలాంటి కామెంట్స్ ని ఫేస్ చేయక తప్పదు. లోకేష్ కూడా అల్లు అర్జున్ సినిమాతో అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ఫిక్స్ అయ్యాడు. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ సినిమాతో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా పూర్తి కాగానే లోకేష్ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్తుంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మించే ప్లానింగ్ లో ఉన్నారు. బన్నీ సినిమాతో లోకేష్ బౌన్స్ బ్యాక్ ఐతే అటు తమిళ్ ఆడియన్స్ తో పాటు తెలుగు ఆడియన్స్ కూడా సూపర్ హ్యాపీ అని చెప్పొచ్చు. లోకేష్ నుంచి ఖైదీ 2 తో పాటు రోలెక్స్ ఇంకా చాలా సినిమాలు రావాల్సి ఉంది. అవి రావాలంటే లోకేష్ తిరిగి తన ఫాం కొనసాగించాల్సి ఉంటుంది.





## మృణాల్ ఎంట్రీకి సర్వం సిద్ధం

అందాల భామ మృణాల్ ఠాకూర్ ఎట్టకేలకు తన తమిళ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చింది. సరైన కథ కోసం ఎదురుచూస్తున్న ఈ బ్యూటీ, కోలీవుడ్ స్టార్ హీరో శింబు సరసన నటించే భారీ అవకాశాన్ని దక్కించుకుంది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రస్తుతం 51 అనే వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనుంది.గతేడాది ప్రదీప్ రంగనాథన్ హీరోగా వచ్చిన 'డ్రాగన్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న అశ్వత్ మారిముత్తు, ఈసారి శింబు కోసం ఒక పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఈ కథ విన్న వెంటనే మృణాల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఏజీఎస్ ఎంటర్టైన్మెంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభం కానుంది. త్వరలోనే చిత్ర యూనిట్ అధికారికంగా మృణాల్ ఎంట్రీపై ప్రకటన చేయనుంది. సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఉన్న మృణాల్, సింబుతో జతకట్టడం ఇప్పుడు కోలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## 'ఆకాశంలో ఒక తార'గా శృతి

వరుస బ్లాక్‌బస్టర్‌లు, పాన్-ఇండియా స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్, ఇప్పుడు మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ఆకాశంలో ఒక తారతో అలరించబోతున్నారు. విలక్షణ కథలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో, ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఇంతకు ముందు విడుదలైన ప్రోమోలు సినిమాపై అంచనాలను పెంచాయి. తాజాగా చిత్ర బృందం ఒక సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, టీం ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఆమె కళ్ళకు అద్దాలు పెట్టుకుని ఇంటెన్స్ లుక్ లో కనిపించడం ఆకట్టుకుంది. పెదవుల పై ఉన్న సిగరెట్, దాని నుంచి ఎగసే పొగ ఆమె పాత్రకు రఫ్, గ్రిట్టీ టచ్‌ను జోడిస్తోంది. కథలో శ్రుతి హాసన్ పాత్ర కీలక మలుపుగా నిలవనుంది. ఆమె ప్రజెన్స్ పవర్ ఫుల్ గా ఉండబోతోంది. ఈ సినిమా సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో ఉండబోతుంది. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీని, శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

## అడవిలో 'హార్ట్ బీట్ ఆఫ్ శబార'



దీక్షిత్ శెట్టి, క్రితికా సింగ్ ప్రధాన పాత్రల్లో ప్రేమ్ చంద్ కిలారు తెరకెక్కించిన చిత్రం 'శబార'. విక్రమ్ ఫిల్మ్ ఫ్రాటర్నిటీ బ్యానర్ మీద హర్షిత చదలవాడ, దుర్గా చుంచు, రమాదేవి కిలారు నిర్మించిన ఈ మూవీకి సంబంధించిన ప్రపంచాన్ని 'హార్ట్ బీట్ ఆఫ్ శబార' ద్వారా పరిచయం చేశారు. మిథున్ ముకుందన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. అజయ్ అబ్రహం జార్జ్ ఈ సినిమాకి కెమెరామెన్‌గా పని చేశారు. 'హార్ట్ బీట్ ఆఫ్ శబార' అంటూ నిర్వహించిన కార్యక్రమంలో.. దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ .. "శబార' కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నా 'గర్ల్ ఫ్రెండ్' సినిమాకి మీడియా మంచి సపోర్ట్ ఇచ్చింది. ఇక ఇప్పుడు 'శబార'కి కూడా అలానే సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను. అందరికీ 'హార్ట్ బీట్ ఆఫ్ శబార' నచ్చి ఉంటుందని అనుకుంటున్నాను. శబార అంటే ప్రపంచం.. ప్రేమ్ చంద్ క్రియేట్ చేసిన ప్రపంచమిది. అడవిలోనే మొత్తం కథ జరుగుతుంది. ఈ మూవీకి ఖచ్చితంగా సక్సెస్ మీట్ జరుగుతుంది. నేను ఇంత వరకు 8 సినిమాలు చేశాను. మొదటి సారిగా ఓ మనిషి మీద నమ్మకం పెట్టుకుని ప్రేమ్ చంద్ కోసం ఈ మూవీని చేశాను. రెండేళ్లుగా మాతో ప్రయాణం చేసిన టీంకు థాంక్స్. మిథున్ తన మ్యూజిక్‌తో మాయ చేశారు. 'హార్ట్ బీట్ ఆఫ్ శబార' నచ్చితే షేర్ చేసి, అందరికీ చేరేలా సపోర్ట్ చేయండి' అని అన్నారు.

## గాబరా గాబరా..గా కపుల్ ఫ్రెండ్లీ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా కపుల్ ఫ్రెండ్లీ. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన కపుల్ ఫ్రెండ్లీ సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రోజు కపుల్ ఫ్రెండ్లీ సినిమా నుంచి గాబరా గాబరా లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు రాకేందు మౌళి లిరిక్స్ రాయగా, ఆదిత్య రవీంద్రన్ కంపోజ్ చేశారు. సంతోష్ నారాయణన్ పాడారు. గాబరా గాబరా పాట ఎలా ఉందో చూస్తే - గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నేరా లక్ ని ఆమడ దూరం, బంతి భోజనంలో బంతిని వడ్డిస్తారా, చేపను వేపాక చెరువులో వేస్తారా, సంబంధం లేని పనులనే, చేస్తున్నాం సిగ్గే పడకనే, చెత్త చేరింది లోనే, గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నెరా లక్ ని ఆమడ దూరం, జానెడుగా పైనకి ఎక్కుదమంటే, బారెడుగా జీవితం కిందకు జారిపోతుందే... అంటూ కలిసి రాని లైఫ్ కు ఫేట్ ఇచ్చే ట్విస్ట్‌లు, ఎంత ప్రయత్నించినా ఎదురయ్యే రెడ్ లక్ లు ఎలా ఉంటాయో చూపిస్తూ ఈ పాట సాగుతుంది.

## అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ హే భగవాన్

ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై హే భగవాన్ అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరానున్నారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వైవిధ్యమైన చిత్రాల కథానాయకుడు సుహాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో లిటిల్‌హార్ట్స్ ఫేమ్ శివానీ నగరం నాయిక. సీనియర్ నటుడు నరేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో యాంకర్ స్రవంతి చొక్కారపు ఓ ప్రముఖ పాత్రలో కనిపించనుంది. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం గ్లింప్స్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా బుధవారం ఈచిత్రం టీజర్‌ను విడుదల చేయడంతో పాటు ఫిబ్రవరి 20న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా జరిగిన ఈ చిత్ర వేడుకలో చిత్ర నిర్మాత బి.నరేంద్ర రెడ్డి. దర్శకుడు గోపీ అచ్చర, ప్రొడక్షన్ డిజైనర్ రామ్‌కుమార్, ఎడిటర్ విప్లవ్, డీవోపీ మహిరెడ్డి, వంశీ నందిపాటి, స్రవంతి చొక్కారపు, హీరో అఖిల్‌రాజ్, హీరోయిన్ తేజస్వీరావు, హీరో సుహాస్, హీరోయిన్ శివానీ నగరం, దర్శకుడు సాయి మార్తండ్, నటుడు సుదర్శన్, నిర్మాత రమణా రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ టీజర్ లాంచ్ అనగానే నాకు



మేసేజ్‌లు వచ్చాయి. ఈ సినిమాలో నాది గత సినిమాలతో పోలిస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్ పాత్రను చేశాను. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్ విత్ కంటెంట్. ఇక నుంచి నా సినిమాలు అందర్ని అలరిస్తాయి. ఈ సినిమాకు వంశీ నందిపాటి, బన్నీవాస్ యాడ్ అయిన తరువాత మా టీమ్‌కు మంచి బూస్ట్ వచ్చింది. నరేంద్ర రెడ్డి ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. ఈ సినిమా నా కెరీర్‌లో బెస్ట్‌ఫిలింగా నిలుస్తుంది. నాకు ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది అన్నారు.

## హ్రీం షూటింగ్ పూర్తి



తెలుగు భీజాక్షరాల్లో 'హ్రీం' అనే అక్షరానికి ఎంతో ఉన్నతమైన విలువలతో కూడిన అర్థం ఉంది. 'హ్రీం' అనే ఒక్క భీజాక్షరంలో 'హ', 'ర', 'ఈ', 'మ' అనే అక్షరాలున్నాయి. హ అంటే ధర్మం, ర అంటే అర్థం, ఈ అంటే కామం, మ అంటే మోక్షం..'హ్రీం' అంటే దర్మార్థ కామ మోక్షాలు కలగలిసిన భీజాక్షరం. ఇప్పటివరకు ఎక్కడా చెప్పని ఒక యదార్థ గాథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రానిన తెరకెక్కించారు. శివమ్‌మీడియా పతాకంపై 'హ్రీం' అనే భీజాక్షరంతో తయారైన ఈ సినిమాలో నూతన నటీనటులు పవన్ తాత, డాక్టర్ చమిందా వర్మ జంటగా నటించారు. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుంది. 'హ్రీం' చిత్రానికి రాజేష్ రావూరి దర్శకుడు. శ్రీమతి సుజాత మల్లాల సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాత. వరంగల్ దగ్గరలోని పెద్ద పెండ్యాల గ్రామంలో తొలి షెడ్యూల్, హైదరాబాద్ హెచ్‌యంటీ కాలనీలోని ఫారెస్ట్ లొకేషన్స్‌లో సెకండ్ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది చిత్రం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కీలక పాత్రల్లో ప్రముఖ నటులు తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రం, అనింగి రాజశేఖర్ (శుభోదయం సుబ్బారావు), త్రిపురనేని శ్రీవాణి, పూజారెడ్డి, వనితా రెడ్డి తదితరులు నటించారు.

## 'సోల్ ట్రిప్' హోస్ట్‌గా హీరో విజయ్

రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్ సమర్పణలో స్టార్ హీరోలతో ఓ ట్రావెల్ బేస్డ్ అడ్వెంచరస్ టాక్ షో ప్రారంభం కానుంది.. అదే 'సోల్ ట్రిప్'. ఈ అడ్వెంచరస్ టాక్ షోలో మన టాలీవుడ్ స్టార్ హీరోస్‌తో ఈ టాక్ షో ప్రేక్షకులను అలరించనుంది. ఇది వరకు పోస్టర్, అన్వేషి వంటి సినిమాలు చేసిన హీరో, నిర్మాత విజయ్ దాట్ల తన సొంత బ్యానర్ గండభేరుండ ఆర్ట్స్‌పై ఈ సెలబ్రిటీ టాక్‌షో సీజన్1ను ముగించుకుని, త్వరలోనే ప్రముఖ ఓటీటీ ఛానెల్‌లో రిలీజ్ చేయబోతున్నారు. గణతంత్య దినోత్సవం సందర్భంగా 'సోల్ ట్రిప్' టాక్ షో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మొదటి సీజన్‌లో హీరో జగపతిబాబు, శ్రీకాంత్, స్టార్ కమెడియన్ అలీ, హీరోయిన్స్ శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్, వర్ష బొల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## రాయలసీమ నేపథ్యంలో దేవగుడి

**పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధారెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా దర్శకత్వంలో స్వీయ నిర్మాతగా రూపొందిన చిత్రం దేవగుడి. ఈ సినిమాలో ఈ అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. దేవగుడి సినిమా ఈ నెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణా రెడ్డి, నటుడు రఘు కుంచె.**

**దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ**

- ఇటీవల రిలీజ్ చేసిన మా మూవీ ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. చిత్ర గారు పాడిన ఆరో ఆరారో పాటకు పెద్ద సంఖ్యలో వ్యూస్ వస్తున్నాయి. ఇప్పుడు రిలీజ్ అవుతున్న మూవీస్ లో మా చిత్రానికే డిజిటల్ వ్యూస్ ఎక్కువగా ఉన్నాయి. సినిమాకు సెన్సార్ నుంచి మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. కాస్త వయలెన్స్, రొమాంటిక్ సాంగ్ ఉందని రెండు కట్స్ తో ఎ సర్టిఫికెట్ ఇచ్చారు. నేనే దర్శకుడిని, నిర్మాతను కావడం వల్ల అనుకున్న కథను అనుకున్నట్లు తెరకెక్కించగలిగాను.
- ఫ్యాక్షన్ నేపథ్యంలో ఇప్పటిదాకా మనకు చాలా సినిమాలు వచ్చాయి. 30 ఏళ్ల క్రితం ట్రెండ్ అది. అయితే మా మూవీలో ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్నా, అది కొంత వరకే చూపించాం. మెయిన్‌గా స్నేహం, ప్రేమ, ఫ్యామిలీ ఎమోషన్స్ మీద కథ ట్రావెల్ అవుతుంది. దేవగుడి వీరారెడ్డి పాత్రలో రఘు కుంచె గారు నటించారు. ఆయన ఆ ప్రాంతంలో మంచి పేరున్న వ్యక్తి. ఆయనకు కూతురు, కొడుకు ఉంటారు. ఆ ఇద్దరు పిల్లలు, వాళ్ల ఇంటి డ్రైవర్ కొడుకు. ఈ ముగ్గురు చిన్నప్పటి నుంచి ఫ్రెండ్స్. వీళ్ల బాల్యంలో జరిగిన సన్నివేశాలు చూపిస్తూ సినిమా ప్రారంభమవుతుంది. కాసేపటికే వాళ్లు పెద్దవాళ్లు కావడం, మెయిన్ స్టోరీలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్తాం. ఆ ముగ్గురి స్నేహితులు ఎందుకు విడిపోవాల్సివచ్చింది అనేది ఆకట్టుకునే భావోద్వేగాలతో సాగుతుంది.
- దేవగుడి మూవీలో 11 నిమిషాల ఒక స్పెషల్ యాక్షన్ ఎపిసోడ్ ఉంటుంది. దాంతో పాటు కొన్ని సర్ ప్రైజింగ్ ఎలిమెంట్స్ ప్లాన్ చేస్తూ వెళ్లాం. ఎక్కడా మూవీ ల్యాగ్ అనిపించదు. నిజ జీవిత ఘటనల ఆధారంగా మంచి కథా కథనాలతో ఈ సినిమాను రూపొందించాను. స్క్రీన్ ప్లే చాలా షార్ప్ గా ఉంటుంది. సినిమాలోని ఒక్కో సీన్ అలా వెళ్తూ ఉంటుంది. మంచి సాంగ్స్ ఉంటాయి. మదీన్ బ్యూటిఫుల్ మ్యూజిక్ అందించారు.



**నటుడు రఘుకుంచె మాట్లాడుతూ**

- ఈ నేను దేవగుడి వీరారెడ్డి అనే పాత్రలో నటించాను. ఆయన ఆ చుట్టు పక్కల ఏరియాలో పవర్ ఫుల్ వ్యక్తి. నాకు పలాస సినిమా తర్వాత అలాంటి రోల్స్ వస్తున్నాయి. ఈ సినిమాలో వీరారెడ్డి పాత్ర కోసం దర్శకుడు రామకృష్ణా రెడ్డి గారు ఎలా చెబితే అలా పర్ ఫార్మ్ చేశాను. రాయలసీమ యాసలో డైలాగ్స్ చెప్పాను. ఈ సినిమా షూటింగ్ అంతా రియల్ లొకేషన్స్ లో చేశాం. ఎక్కడైతే కొన్ని ఇన్సిడెంట్స్ జరిగాయని దర్శకుడు స్క్రిప్ట్ రాశారో అక్కడే షూటింగ్ చేశాం. దర్శకుడిగా, నిర్మాతగా బెల్లం రామకృష్ణా రెడ్డి గారు ఆయన జాబ్ పర్ఫెక్ట్ గా చేశారు. సినిమా కోసం బాగా ఖర్చు పెట్టారు.
- స్నేహం, ప్రేమ, పగ, ఫ్యామిలీ ఎమోషన్స్ తో ఈ మూవీ ఆకట్టుకునేలా సాగుతుంది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్నా దాన్నొక బ్యాక్ డ్రాప్ లా మాత్రమే పెట్టుకున్నారు. ఈ సినిమాలో ప్రతి ఒక్కరూ డెడికేషన్ తో వర్క్ చేశారు. లోకల్ ఆర్టిస్టులు కూడా బాగా నటించారు. ఈ సినిమాలో నేను ఒక పాట కంపోజ్ చేసి పాడాను. మదీన్ మంచి సాంగ్స్ చేశాడు. అతనికి మ్యూజిక్ డైరెక్టర్ గా ఫ్యూచర్ ఉంటుంది.
- యాక్టర్ కావాలని నేనెప్పుడూ అనుకోలేదు. అలా జరిగిపోయింది. సింగర్ కావాలనే ఇండస్ట్రీకి వచ్చాను. దాదాపు 40 సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్ గా వర్క్ చేశాను. వచ్చిన అవకాశాలు వదులుకోకుండా నటిస్తున్నాను. నటుడిగా పెద్ద ప్రతిభావంతుడిని అనుకోవడం లేదు. అయితే సిన్సియర్ గా నా పాత్రకు న్యాయం చేసేలా ప్రయత్నిస్తున్నాను. మనోజ్ బాజ్ పాయ్ ఫ్యామిలీ మ్యాన్ లో చేసినట్లు అలాంటి క్యారెక్టర్స్ లో నటించాలని ఉంది. ప్రస్తుతం నాలుగైదు చిత్రాల్లో నటిస్తున్నా.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044